ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

వివాదాల ఆర్‌యూ

- గాడి తప్పిన ఉన్నత విద్య పాలన
- వివాదాస్పద అంశాలను కప్పిపుచ్చే ప్రయత్నం
- త్వరలో పాలక మండలి ఏర్పాటు?

కర్నూలు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. కోర్టు కేసులతో ముడిపడి ఉన్న పలు వివాదాస్పద అంశాలు, తాజా, మాజీ అధికారులు చేసిన తప్పుల నుంచి బయటపడేందుకు సిద్ధమవుతోంది. ఈనెల రెండో వారంలో పాలకమండలి ఏర్పాటు ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఉన్నత విద్యాశాఖ మంత్రి లోకేశ్ పేషీ, ఉన్నత విద్యామండలిలోని చైర్మన్ పేషీ డైరెక్షన్‌లో వేసిన తప్పటడుగులను సరిచేయాలనే ప్రయత్నాలు వేగం పుంజుకున్నట్లు కొందరు ప్రొఫెసర్లు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం పాలకమండలి ఏర్పాటుచేయక ముందే చైర్మన్‌తో కూడిన కోరంతో వివాదాస్పద అంశాలను కప్పి పుచ్చేందుకు భారీ స్కెచ్ వేశారనే ప్రచారం ఉంది. వీటన్నింటికి పైస్థాయి నుంచి ఆశీస్సులు ఉండటంతో సమావేశానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో పాలకమండలి సమావేశానికి ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్, డైరెక్టర్ గుప్తా అనుమతులు ఇవ్వకపోవడంతో గతనెల చివరి వారంలో జరగాల్సిన సమావేశం ఈనెలలో జరిపేందుకు కసరత్తు జరుగుతోంది. పాలకమండలికి అనుమతులు ఇవ్వడం లేదని ఐఏఎస్‌లకు వ్యతిరేకంగా గత నెలలో రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థులతో ఓ ఉద్యోగి వర్సిటీల్లో ఐఏఎస్‌ల జోక్యం తగ్గించాలంటూ ఆందోళనలు చేయించడం కొసమెరుపు. ఈనేపథ్యంలో పాలకమండలి జరిగే ప్రక్రియపై అందరు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



వివాదాస్పద అంశాలు..

- కోర్టు కేసుతో జాయిన్ అయినా ఒక కాంట్రాక్టు ఉద్యోగికి బేసిక్‌పేతో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏ, సీసీఏ పాలక మండలిలో అమలుకు లోకేశ్ పేషీలోని ఓ ఓఎస్‌డీ సూచనలతో ఉపకులపతి తాపత్రయం అంటూ ప్రొఫెసర్ల మధ్య చర్చ జరిగింది.
- కోర్టు కేసులతో కొనసాగుతున్న ముగ్గురు ప్రొఫెసర్లకు ఇంక్రిమెంట్లు ఇవ్వడం రాష్ట్రంలో ఏ వర్సిటీలో తీసుకొని నిర్ణయం అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్న విద్యార్థి సంఘాలు.
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల చెల్లింపులు అదేవిధంగా పీజీ సెట్ అకౌంట్ నుంచి రూ.80లక్షలు తన పర్సనల్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకున్న కారణంగా సస్పెండ్ అయిన ప్రొఫెసర్‌కు రీజాయినింగ్ ఆర్డర్ ఇవ్వడంపై కొందరు ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు. ఇలా వివాదాల అంశాలను పాలకమండలి సభ్యులకు తెలియకుండానే వారితో సంతకాలు పెట్టించేందుకు ఆర్‌యూ అధికారులు కుట్రకు తెరలేపారనే కొందరు సభ్యులు ఆగ్రహంతో ఉన్నారు.

పాలక మండలికి ఇంకా అనుమతి రాలేదు

పాలక మండలికి ఉన్నత విద్యామండలి అనుమతి ఇవ్వలేదు. పాలక మండలికి అవసరమైన అంశాలను పెట్టడానికి అనుమతులు అయితే కోరాం. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీ కూడా ఇంకా అనుమతి ఇవ్వలేదు.

- విజయకుమార్ నాయుడు, రిజిస్ట్రార్, రాయలసీమ యూనివర్సిటీ

జలసారథులు వచ్చారు

- హంద్రీ నీవా ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్ఈగా పాండురంగయ్య
- కర్నూలు సర్కిల్ ఎస్ఈగా బాలచంద్రారెడ్డి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు, మే 5 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖకు సారథులు వచ్చారు. రాయలసీమ జిల్లాలకు సాగు, తాగు జలాలు అందించే కీలకమైన హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు కర్నూలు సర్కిల్ ఎస్ఈగా టీబీపీ ఎల్లెల్సీ ఈఈ పాండురంగయ్య పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగించారు. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా డిప్యూటీ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు ఇచ్చారు. సోమవారం జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.



ఎస్ఈ పాండురంగయ్య

హంద్రీనీవా ఎస్ఈగా ఉన్న సురేష్‌బాబు, కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్‌రెడ్డి ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఆ స్థానాలను తాజాగా ప్రభుత్వం భర్తీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. హంద్రీనీవా ఎస్ఈగా నియమితులైన పాండురంగయ్య స్వగ్రామం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండలం ఉరందురు గ్రామం. ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యాభ్యాసం చేసిన ఆయన తిరుపతిలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్(సివిల్ ఇంజనీరింగ్), కర్ణాటక రాష్ట్రం మంగళూరులోని ఆర్ఈసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్ పూర్తి చేశారు. 1988లో జలవనరుల శాఖలో ఏఈఈగా ఉద్యోగం రావడంతో నంద్యాల ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టులో విధుల్లో చేరారు. 12 ఏళ్ల ఏఈఈగా ఎస్ఆర్‌బీసీ, తుంగభద్ర ఎల్లెల్సీలో పని చేశారు. 2002లో డీఈఈగా పదోన్నతి పొందారు. గాజులదిన్నె ప్రాజెక్టు, టీబీపీ ఎల్లెల్సీ ప్రాజెక్టుల్లో పని చేశారు. 2009లో ఈఈగా పదోన్నతి పొందారు. దుమ్ముగూడెం, హంద్రీనీవా, శ్రీశైలం, పోలావరం ప్రాజెక్టుల్లో పని చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన బదిలీల్లో భాగంగా పాండురంగయ్యను టీబీపీ ఎల్లెల్సీ ఈఈగా బదిలీ చేయడంతో మార్చిలో బాధ్యతలు చేపట్టారు. గత నెల 30న హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్ఈ (ఎఫ్ఏసీ) సురేష్‌బాబు పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో పాండురంగయ్యకు పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.



కర్నూలు సర్కిల్ ఎస్ఈగా బాలచంద్రారెడ్డి

జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ డిప్యూటీ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) ఇచ్చారు. కడప జిల్లా మైనర్ ఇరిగేషన్ ఈఈగా పని చేస్తున్న ఈయనకు గతేడాది అక్టోబరు 18న కర్నూలు సర్కిల్ డీఎస్ఈగా బదిలీ చేసి, ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాటి నుంచి ఈ ఏడాది జనవరి 23 వరకు మూడు నెలలకు పైగా ఎస్ఈగా పని చేశారు. ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టింది. అందులో భాగంగా కడప జిల్లా ఎన్టీఆర్ తెలుగుగంగా ప్రాజెక్టులో పని చేస్తున్న స్థానంలో కడప నుంచి ద్వారకనాథ్‌రెడ్డిని కర్నూలు ఎస్ఈగా బదిలీ చేశారు. ఆయన ఏప్రిల్ 30న పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో డిప్యూటీ ఎస్ఈ బాలచంద్రారెడ్డికి ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది. కడప జిల్లా మైదుకూరుకు చెందిన ఈయన 1989లో ఏఈగా జలవనరుల శాఖలో ఉద్యోగంలో చేరారు. 2002లో డీఈఈ, 2013లో ఈఈగా పదోన్నతి వచ్చింది. వివిధ ప్రాజెక్టుల్లో పని చేసిన ఆయన 2019లో కడప మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) ఈఈగా బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి అక్కడే పని చేస్తున్న బాలచంద్రారెడ్డిని గతేడాది కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ డీఎస్ఈగా బదిలీ చేసింది. తాజాగా ఎస్ఈ (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించారు.



బి.బాలచంద్రారెడ్డి

ఎమ్మిగనూరు వైద్యుడిపై విచారణకు ఆదేశం

కర్నూలు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో చిన్నపిల్లల వైద్యురాలిగా పని చేస్తున్న డాక్టర్ సుధా అయ్యగారిపై వచ్చిన ఆరోపణలపై విచారణ కోసం ప్రత్యేక అధికారిని నియమిస్తూ వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ సుధా గతంలో శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో కూడా పని చేశారు. తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదంటూ ఆమె గతంలో ప్రభుత్వానికి వినతిపత్రం (లేఖ) రాశారు. పరిశీలించిన ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా విజిలెన్స్ అధికారి డాక్టర్ బీసీకే నాయక్‌ను నియమించారు. రెండు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు నివేదికలో ఆదేశించారు.

ఆస్తమానం ఇబ్బందులే..! 7

పోలీసులకు 111 ఫిర్యాదులు

కర్నూలు క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 111 ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను ఏఎస్పీ హుస్సేన్ పీరా స్వీకరించారు. చెత్తబండి ఇప్పిస్తానని చెప్పి రూ.3.30 లక్షలు తీసుకుని ధనుంజయ్, జానకీరాముడు మోసం చేశారని క్రిష్ణగిరి మండలం ఆలంకొండ గ్రామానికి చెందిన బంగారి ఫిర్యాదు చేశారు. రూ.2లక్షలు విలువ గల కంది పంటను నాశనం చేసి తమ కుటుంబాన్ని మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామానికి చెందిన మాల మాధమ్మ ఫిర్యాదు చేశారు. పది ఎకరాల ఆస్తిని ఇద్దరు కొడుకులు పంచుకున్నారని, ఇచ్చిన పించన్ డబ్బులు కూడా లాక్కుంటున్నారంటూ ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికి చెందిన అంగడి శివమ్మ పోలీసుల ఎదుట వాపోయింది. అదేవిధంగా కర్నూలు సంతోష్‌నగర్ వద్ద ఉన్న విజయనగర్ కాలనీలో మార్ట్‌గేజ్ చేసిన ఒక ప్రాపర్టీని విక్రయిస్తామని చెప్పి కొందరు మధ్యవర్తులు అడ్వాన్సుగా డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నారని కర్నూలు బాలాజీనగర్‌కు చెందిన రెహిమాన్ ఫిర్యాదు చేశారు. వాట్సాప్‌లో వచ్చిన అపరిచిత లింక్‌తో కొందరు మోసగించి రూ.5లక్షలు తన ఖాతానుంచి మళ్లించుకున్నారని కర్నూలుకు చెందిన సునీత ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని ఏఎస్పీ హుసేన్‌పీరా బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస నాయక్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏఎస్పీ హుస్సేన్‌పీరా

పత్తి ధరలు పతనం



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు మరింత పతనమయ్యాయి. 15 రోజుల కిందట క్వింటా గరిష్ఠంగా రూ.8,250 పలికిన ధర మళ్లీ దిగజారింది. సోమవారం క్వింటా గరిష్ఠంగా రూ.7,949కు ధర పడిపోయింది. రోజురోజుకి ధరలు పతనం అవుతుండడంతో పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ పెట్టుబడి ఖర్చుల కోసం చాలామంది రైతులు ధరలు పెరుగుతాయని ఆశించి తమ పత్తిని ఇళ్లలో నిల్వ ఉంచుకున్నారు. ధరలు పెరుగుతాయని ఆశించినా మళ్లీ దిగజారుతుండడంతో అమ్ముకోవాలో లేక నిల్వ ఉంచుకోవాలో తెలియక అయోమయంలో ఉన్నామని రైతులు తెలుపుతున్నారు. సోమవారం ఆదోని మార్కెట్‌కు 349 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటా రూ.4,109, గరిష్ఠంగా రూ.7,949, సగటున రూ.6,959 పలికింది.

కర్నూలు ఎయిర్‌పోర్టు ఎఫ్‌టీఓకు టాక్సీవే

- రూ.2.27 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

కర్నూలు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని కర్నూలు విమానాశ్రయంలో ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనేజేషన్ (ఎఫ్‌టీఓ)కు అనుసంధానం చేసే టాక్సీవే నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.2.27 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కర్నూలు విమానాశ్రయంలో విమాన శిక్షణ సంస్థ (ఎఫ్‌టీఓ) ఏర్పాటు కోసం ఓరియంట్ ఫ్లైట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఏడీఎల్‌సీ) 2024 జూలై 26న ఒప్పందం కుదుర్చుకుంది. షరతుల ప్రకారం ఎఫ్‌టీవో 12 నెలల్లో శిక్షణ కార్యక్రమాలు మొదలు పెట్టాలి. అందుకు అనుగుణంగా రన్‌వే నుంచి హంగర్ వరకు టాక్సీవేను ఏపీఏడీసీఎల్ నిర్మించి ఇవ్వాలని ఒప్పందంలో స్పష్టంగా పేర్కొన్నారు. అందుకోసం రూ.2.27 కోట్లు నిధులు మంజూరు, పరిపాలన అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఏపీఏడీసీఎల్ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పరిశీలించిన ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు జారీ చేసింది. రన్‌వే నుంచి హంగర్ వరకు టాక్సీవే నిర్మాణం పూర్తి చేస్తే కర్నూలు విమానాశ్రయం కేంద్రంగా విమాన శిక్షణ కార్యక్రమాలు ఊపందుకుంటాయి.

విజన్ ఉంటేనే అభివృద్ధి

- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- ఓర్వకల్లు- గుట్టపాడు ఎంఎస్ఎంఈ ప్రారంభం

ఓర్వకల్లు, మే 5 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు పెట్టాలంటే విజన్ తప్పనిసరిగా ఉండాలని పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఆ విజన్ సీఎం చంద్రబాబు నాయుడుకు ఉందని, ఆయన సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వెళ్తోందన్నారు. సోమవారం ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామం వద్ద రూ.38.47 కోట్లతో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకప్పుడు 60 శాతం మార్కులు వస్తేనే ఎక్కువ అనుకునేవాళ్లు అని ఇప్పుడు 99 శాతం మార్కులు వస్తున్నాయన్నారు. అదేవిధంగా సరైన శిక్షణ, చదువు ఉంటేనే ఉద్యోగాలు వస్తాయన్నారు. కాబట్టి ఈ ప్రాంతంలోని యువతకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఓర్వకల్లులో పైలట్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. దూపాడు-బేతంచెర్ల రైల్వే సైడింగ్‌కు అనుమతులు వస్తున్నాయన్నారు. అనంతపురం-కర్నూలు ఇండస్ట్రియల్ జోన్‌కు కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన టీసీఎస్, ఆర్సెలర్ మిట్టల్ కంపెనీలు, 14 వేల కోట్ల విలువైన సెమి కండక్టర్ ప్రాజెక్టులు తమ హయాంలో వస్తున్నాయన్నారు. ఈ ప్రాజెక్టులు రావడంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవ కీలకమన్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ 2014లో ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఓర్వకల్లు మండలాన్ని సీఎం చంద్రబాబు నాయుడు ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దారనీ, ఎయిర్‌పోర్టు, డీఆర్‌డీవో, జయరాజ్ ఇస్పాత్, సోలార్ పార్కు వంటి పరిశ్రమలు తీసుకువచ్చారని అన్నారు. ప్రస్తుతం 300 ఎకరాల్లో డ్రోన్ హబ్‌ను కేటాయించారన్నారు. కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు కోసం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే ఏడు నియోజకవర్గాల్లో భూములను కూడా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్డీవో సందీప్ కుమార్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం అరుణ కుమారి, పొదుపు లక్ష్మి మండల ఐక్యసంఘం గౌరవ సలహాదారు విజయభారతి, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచ్ నర్ల మోహన్ రెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, సుధాకర్ రెడ్డి, పుసులూరు ప్రభాకర్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, సుధాకర్‌రావు, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, దేవేంద్ర, పుల్లారెడ్డి, తిరుపాలు, రాజన్న పాల్గొన్నారు.



గుట్టపాడులో ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టర్ రంజిత్ బాషా

దరఖాస్తులను పరిష్కరించండి : కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 26, కర్నూలు ఆర్డీఓ వద్ద 25, పత్తికొండ ఆర్డీఓ వద్ద 7, సర్వే ఏడీలో 2, అటవీశాఖ, పంచాయతీరాజ్, పౌరసరఫరాలు, మత్స్యశాఖ, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వద్ద ఒక అర్జీ చొప్పున పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు భూమి పూజ

ఏర్పాట్లను పరిశీలించిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆదోని సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు/ రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి ఫారం సమీపంలో దాదాపు 77 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న టెక్స్‌టైల్ పార్కుకు మంగళవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ చేయనున్నారు. ఏర్పాట్లను ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలశాఖ మంత్రి టీజీ భరత్, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, రోడ్లు, న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కలెక్టర్ రంజిత్‌బాషా, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డితో పాటు జనసేన, బీజేపీ రాష్ట్ర నాయకులు హాజరు కానున్నారు.

గుంతల రోడ్లకు మోక్షం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రహదారి మరమ్మతులకు నిధులు
- ఆర్‌అండ్‌బీకి రూ. 61.90 కోట్లు మంజూరు
- పీఆర్‌కు రూ. 39.83 కోట్లు
- త్వరలో టెండర్ల స్వీకరణ
- ఐదేళ్లపాటు రోడ్లను విస్మరించిన వైసీపీ సర్కార్

నంద్యాల, మే 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పల్లె పట్టణం అనే తేడా లేకుండా రహదారుల నిర్వహణ గాలికి వదిలేసింది. ఐదేళ్ల పాటు నిధులు ఆశించిన స్థాయిలో మంజూరు చేయకుండా పూర్తిగా విస్మరించింది. దీంతో ఎక్కడికక్కడ రహదారులు అధ్వాన స్థితికి చేరాయి. తద్వారా సదరు రహదారుల్లో రాకపోకలు నరకప్రాయంగా మారాయి. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా గత సర్కార్ ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. విడతల వారీగా రోడ్ల మరమ్మతులకు నిధులు విడుదల చేయడం చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరోమారు.. కర్నూలు, నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ, పీఆర్ పరిధిలోని రోడ్ల మరమ్మతులకు రూ.101.73 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ నిధులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ పరంగా.. రూ.61.90 కోట్లతో 171.03 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ శాఖ పరంగా.. రూ.39.83 కోట్లతో 88.46 కిలోమీటర్ల మేర మరమ్మతులు త్వరలో చేయనున్నారు. ఇదే క్రమంలో త్వరలో ఆయా శాఖల నేతృత్వంలో టెండర్లు పిలవనున్నట్లు అధికారులు తెలియజేశారు.



పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

రహదారులకు మరమ్మతులు

ఉమ్మడి జిల్లాలో గత ఐదేళ్లలో రోడ్లను గత వైసీపీ సర్కార్ ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో సదరు రహదారులు పూర్తిగా దెబ్బతిన్న సదరు రహదారుల గుండా ప్రయాణం చేయాలంటే నరకం కనబడేది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖల పరంగా వేర్వేరుగా నిధులు మంజూరు చేసింది.

మిగతా 7వ పేజీలో

కర్నూలు జిల్లాలో....

- ఆర్‌అండ్‌బీకి మంజూరైన నిధులు : రూ.18.80 కోట్లు
- చేయాల్సిన మరమ్మతులు: 47.62 కిలోమీటర్లు
- పంచాయతీరాజ్ శాఖకు మంజూరైన నిధులు : రూ.19.68 కోట్లు
- చేపట్టాల్సిన మరమ్మతులు: 43 కిలోమీటర్లు

నంద్యాల జిల్లాలో...

- ఆర్‌అండ్‌బీకి మంజూరైన నిధులు : రూ.43.10 కోట్లు
- చేయాల్సిన మరమ్మతులు : 123.41 కిలోమీటర్లు
- పంచాయతీ రాజ్‌శాఖ మంజూరైన నిధులు: రూ.20.15 కోట్లు
- చేయాల్సిన మరమ్మతులు : 45.46 కిలోమీటర్లు

ఈశ్రమ్ కార్డులతో ప్రయోజనాలు

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కర్నూలు లీగల్, మే 5(ఆంధ్రజ్యోతి): ఈశ్రమ్ కార్డులతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని, ప్రతి కార్మికుడు కార్డులను పొందాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. సోమవారం నగరంలోని న్యాయ సేవాసదన్ భవన్‌లో ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని, వాటి ద్వారా కార్మికులు హెల్త్ ఇన్సూరెన్స్, బీమా వసతిలతో పాటు ఇతర ప్రయోజనాలు లభిస్తాయని తెలిపారు. డీఎంహెచ్‌వో పి.శాంతికళ మాట్లాడుతూ తమ శాఖలోని ఆశావర్కర్లు అందరూ ఈశ్రమ్ కార్డులు పొందారని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈశ్రమ్ కార్డు కోసం ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలి? పాటించాల్సిన నిబంధనలు, మొదలైన అంశాలను వివరించారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే సామాజిక భద్రతా పథకాలు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద రూ.2 లక్షలు ప్రమాద మరణ బీమా ఉచితంగా కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్టుమెంట్ లీగల్ ఆఫీసర్ సుమలత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మైనర్‌ను వివాహం చేసుకున్న యువకుడు

సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు, వీడియోలు వైరల్

కోసిగి, మే 5 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండలానికి చెందిన ఓ బాలికను ఓ యువకుడు వివాహం చేసుకున్నాడు. పెళ్లికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో రావడంతో వైరల్‌గా మారింది. వివరాలివీ.. తన 16 ఏళ్ల కుమార్తెను మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ముగ్గురు యువకులపై అనుమానం వ్యక్తం చేస్తూ కోసిగి మండలానికి చెందిన బాలిక తండ్రి ఈనెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి అదృశ్యం కేసు నమోదు చేశారు. అయితే రచ్చుమర్రి గ్రామానికి ఓ యువకుడు బాలికను కర్ణాటక ప్రాంతానికి తీసుకెళ్లి వివాహం చేసుకున్న వీడియోలు సోమవారం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టాయి. కోసిగి పోలీసులను వివరణ కోరగా.. విచారిస్తామని చెప్పారు.

గుంతల రోడ్లకు మోక్షం



(5వ పేజీ తరువాయి)

దీంతో పల్లె పట్టణం అనే తేడా లేకుండా రహదారుల మరమ్మతులు చేయనున్నారు.

ఇది వరకే గుంతల రోడ్లకు...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. రోడ్ల మరమ్మతులకు ఇదివరకే నిధులు మంజూరు చేసి పనులు చేసిన విషయం తెలిసిందే. అయితే.. గుంతలు పూడ్చినా.. సాఫీగా ప్రయాణం చేసేందుకు అవకాశం లేని వాటిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు (రెన్యువల్) నిధులు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ పరిధిలోని 171.03 కిలోమీటర్ల మేర రోడ్లు పనులు పూర్తి చేసేందుకు రూ.61.90 కోట్లు (నాబార్డ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(ఆర్ఐడీఎఫ్) కింద నిధులు మంజూరు చేసింది.

పంచాయతీరాజ్ శాఖకు నిధులు

ఉమ్మడి పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో ఇప్పటికే పల్లె పండుగ కింద రూ. కోట్ల నిధులు మంజూరు చేసి గ్రామీణ రహదారుల పనులు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. 88.46 కిలోమీటర్లు మరమ్మతులు చేసేందుకు రూ. 39.83 కోట్లు(నాబార్డు కింద) నిధులు మంజూరు చేశారు.

త్వరలో టెండర్లు

గతంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వం కేంద్రం సహకారంతో రూ. కోట్ల నిధులు రోడ్ల మరమ్మతుల కోసం మంజూరు చేయడం గమనార్హం. దీంతో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని రోడ్ల దశ మారనుంది. పైగా రోడ్లు భవనాల శాఖ మంత్రి సొంత జిల్లా కావడం మరింత కలిసి వచ్చినట్లైంది. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు కూడా ఈ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారు. త్వరలోనే టెండర్లు పిలిచి త్వరితగిన పనులు పూర్తి చేయాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

వైసీపీ పాలనలో నరకం

గత ఐదేళ్ల పాలనలో వైసీపీ సర్కార్ రహదారుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రజలు అవస్థల నడుమ ప్రయాణం చేయాల్సిన దుస్థితి. కొత్త రోడ్ల సంగతి అటు ఉంచితే.. కనీసం గుంతలను కూడా పూడ్చింది లేదు. ఆర్‌అండ్‌బీ, పీఆర్ పరంగా అరకొర నిధులు నిధులు కేటాయించి మమ అనిపించారు. దీంతో ఎక్కడా కూడా ఆశించిన స్థాయిలో పనులు సాగలేదు. పైగా వచ్చిన పనులకు కూడా బిల్లులు సకాలంలో చేయకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో కాంట్రాక్టర్లు సైతం పనులు చేయకుండా మొండికేశారు. మొత్తమ్మీద ఎక్కడి పనులు అక్కడే ఆగిపోవడంతో రహదారులు మరింత అధ్వానంగా మారి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించినట్లైంది. ఇదిలా ఉండగా..చేసిన అరకొర పనులకు సైతం గత వైసీపీ సర్కార్ రూ. కోట్లలో బిల్లులు పెండింగ్ పెట్టిందని బాధిత కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

నిధులు రావడం శుభపరిణామం

తాజాగా ఆర్ఐడీఎఫ్ కింద ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్ల మరమ్మత్తలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం శుభపరిణామం. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు ఈ పనుల పరంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

-ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి

త్వరలో టెండర్లు పిలుస్తాం

నాబార్డు కింద ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. త్వరగా ఎస్టిమేట్స్ తయారు చేసి ఈ నెల ఆఖరుకు టెండర్ల పక్రియ పూర్తి చేస్తాం. వచ్చే మూడు నెలల్లో పనుల్నీ పూర్తి చేస్తాం. ప్రభుత్వం పల్లె రోడ్ల పనులపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి నిధులు మంజూరు చేయడం ప్రజలకు ఎంతో దోహదపడుతుంది.

- పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి

ఆస్తమానం ఇబ్బందులే..!



- సమస్యను ముందే గుర్తించాలి..
- మందులతో చికిత్స
- నేడు వరల్డ్ ఆస్తమా డే

కర్నూలు హాస్పిటల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం బీపీ, మధుమేహంతో పాటు ఆస్తమా కూడా ప్రజానీకాన్ని వేధిస్తోంది. కలుషిత వాతావరణం, ఆహారపు అలవాట్లు, దీర్ఘకాలికంగా వైరల్ ఇన్‌ఫెక్షన్లు, రసాయనాలకు గురికావడం వంటివి కూడా ఆస్తమాకు దారితీస్తాయి. బాధితుల్లో శ్వాసపరమైన ఇబ్బందులు, ఛాతీ బిగుతుగా అనిపించడం, కఫం, ఊపిరితిత్తుల్లో నొప్పి వంటి లక్షణాలు ప్రధానంగా కనిపిస్తాయి. దీనికి వైద్యపరంగా తగిన చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. క్రమం తప్పకుండా వైద్యసలహాలు పాటిస్తే ఆస్తమాను చాలా వరకు నియంత్రణలో ఉంచుకోవచ్చు. అయితే రోగులకు మందులపై సరైన అవగాహన లేకపోవడం, జబ్బు మీద అపోహలు, భయాలు నెలకొనడం పెద్ద సమస్యగా పరిణమిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆస్తమా బాధితులతో పోలిస్తే మనదేశంలో 13 శాతం మంది దీంతో బాధపడుతుండగా.. ఆస్తమా మరణాల్లో 42 శాతం మరణాలు సంభవిస్తున్నాయి. ఆస్తమాపై అవగాహన పెంచేందుకు గ్లోబల్ ఇన్‌షియేటివ్ ఫర్ ఆస్తమా, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది మే మొదటి మంగళవారం వరల్డ్ ఆస్తమా డే నిర్వహిస్తుంది. ఈ ఏడాది 'ఇన్‌హేలర్ ట్రీట్‌మెంట్' అందరికీ అందుబాటులో ఉండేలా చేయండి అన్ని నినాదం ఇచ్చింది.

ఓపీకి 10 శాతం మంది రోగులు



కర్నూలు జీజీహెచ్‌కు ప్రతి రోజు ఊపిరితిత్తుల విభాగానికి 100 నుంచి 120 మంది రోగులు వస్తుంటారు. ఇందులో పది శాతం ఆస్తమా రోగులు, దగ్గు పిల్లికూతలు పని చేయకపోవడం, ఛాతి బిగుతుగా ఉండటం లక్షణాలతో వస్తుంటారు. ఆసుపత్రిలో రోగులకు ఇన్‌హేలర్ థెరపీ, నెబులైజర్ ద్వారా, మందులతో మెరుగైన చికిత్స అందిస్తున్నాం. నిరంతరం దగ్గు, ఆయాసం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

- డాక్టర్ అంబర్‌నాథ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఊపిరితిత్తుల విభాగం, కర్నూలు జీజీహెచ్

ఇన్‌హేలర్లు సురక్షితం




ఆస్తమా రోగులకు ఇన్‌హేలర్లు సురక్షితమైనవి. ఇన్‌హేలర్ల వాడకంపై ఎలాంటి అనుమానాలు వద్దు. కొందరికి ఆయా కాలాల్లో ఆయా పరిస్థితుల్లో ఆస్తమా ఎక్కువవుతుంది. కొందరికీ ఏసీ, కొన్ని రకాల పదార్థాలు పడకపోవచ్చు. ఇలాంటి అలర్జీ కారణాలకు దూరంగా ఉండే ఆస్తమాను నియంత్రించవచ్చు. వైద్యులు సూచించిన మందులను ఆస్తమా రోగులు తప్పకుండా వాడలి. జలుబు, ఫ్లూ వంటి అలర్జీ కారకాలను నియంత్రించుకోవాలి.

- డాక్టర్ సి.శ్రీనివాసరెడ్డి, చెస్ట్ ఫిజీషియన్, అశ్విని హాస్పిటల్ కర్నూలు

ఇన్‌హేలర్లపై అనుమానం వద్దు

ఇన్‌హేలర్లు సురక్షితం. ఆందోళన, అనుమానాలు వద్దు. ఆస్తమా చాలా తీవ్రంగా ఉంటేనే చివరి దశలోనే ఇన్‌హేలర్లు వాడుతారనీ అనుకోవద్దు. ఇన్‌హేలర్‌లో తీసుకునే మందు మోతాదు, మైక్రో గ్రాముల్లో ఉంటుంది. ఇది నేరుగా శ్వాస మార్గాల్లోకి చేరుకుంటుంది. ఇన్‌హేలర్ల వాడకంపై ఈ ఏడాది డబ్ల్యూహెచ్‌ఓ ప్రాధాన్యత ఇచ్చింది. పిల్లల విషయంలో ఇన్‌హేలర్లు వాడకంపై కొందరు అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదు. స్టెరాయిడ్ల వాడకంతో పిల్లల ఎదుగుదల కుంటు పడుతుందని భయపడుతుంటారు. ఇది తప్పు. ఆస్తమా నియంత్రణలో లేకపోతేనే ఎదుగుదల దెబ్బతింటుంది. ఇన్‌హేలర్లు ఖరీదైనవే కావొచ్చు. కానీ వీటిని సరిగ్గా వాడకపోవడం వల్ల ఆసుపత్రికి చేరితే అయ్యే ఖర్చుతో పదేళ్లకు సరిపడిన ఇన్‌హేలర్ మందులు కొనుక్కోవచ్చు. ఇన్‌హేలర్‌కు స్పేసర్‌ను జోడించి మందు పీల్చుకోవడం అన్ని విధాలుగా మంచిదని వైద్యనిపుణులు చెబుతున్నారు.



పరీక్షలు

ఆస్తమా నిర్ధారణకు స్పైరో మెట్రి ప్రామాణిక పరీక్ష. గట్టిగా శ్వాస తీసుకుని స్పైరో మీటర్ గొట్టం లోనికి గాలికి ఊదడం ఇందులో కీలకాంశం. పీక్‌ఫ్లో మీటర్ అనేది గాఢంగా గాలి పీల్చుకుని దీని గొట్టంలోకి గట్టిగా ఊదితే ఊపిరితిత్తుల నుంచి గాలి ఎంత బలంగా బయటకు వస్తుందనేది బయటపడుతుంది. ఇది మందులు వేసుకుంటున్నప్పుడు ఎలా పని చేస్తున్నాయా తెలుసుకోవచ్చు. ఆస్తమా బాధితులకు ఎక్స్‌రే ద్వారా వ్యాధి నిర్ధారణ అవుతుంది. క్షయ, సీవోపీడీ, న్యూమోనియా, క్యాన్సర్, లంగ్ డిసీజ్, వంటి సమస్యల్లో దగ్గు ఉంటుంది. అందువల్ల ఎక్స్‌రే తీసి చూడటం మంచిది.

ఆస్తమా అంటు వ్యాధి కాదు



ఆస్తమా అంటు వ్యాధి కాదు. సరైన అవగాహన, వ్యాధి నిర్ధారణ చికిత్సతో ఆస్తమాను నియంత్రణలో ఉంచవచ్చు. ఆస్తమా గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి ఏడాది మే మొదటి మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆస్తమా పెద్దలతో పాటు పిల్లల్లో కూడా ఎక్కువగా వస్తుంది. ఇండియాలో 11 ఏళ్లలోపు చిన్నారుల్లో నూటికి 5 నుంచి 15 మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. - డాక్టర్ కె.సువర్ణలక్ష్మి, పల్మనాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

రాహుల్ గాంధీ పోరాటంతోనే కులగణన

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ యాదవ్

కల్లూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పోరాట ఫలితంగానే కేంద్రం కులగణనకు సిద్ధమైందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యులు జె.లక్ష్మీ నరసింహ యాదవ్ తెలిపారు. సోమవారం నంద్యాల చెక్‌పోస్టు సర్కిల్‌లో రాహుల్ గాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహయాదవ్ మాట్లాడుతూ దేశంలో 60 శాతం పైగా ఉన్న బీసీల జనాభా లెక్కలు లేకపోవడం శోచనీయమన్నారు. దీనివల్ల విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో ఓబీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామనీ, 50 శాతం రిజర్వేషన్ పరిధిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖను వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు షేక్ రజాక్ వలి, పఠాన్ హబీబ్ ఖాన్, బాలస్వామి, జాకీర్ హుశేన్, చెన్నయ్య పాల్గొన్నారు.



రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన బస్సు

- హైదరాబాద్ జాతీయ రహదారిలో అర్ధరాత్రి కలకలం

కర్నూలు క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): హైడ్రో క్లోరిక్ యాసిడ్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అర్ధరాత్రి హైదరాబాదు జాతీయ రహదారిపై కలకలం రేగింది. నగర శివారులో ఉన్న ఓ ఫ్యాక్టరీ నుంచి రాణిపేటకు హైడ్రో క్లోరిక్ ఆమ్లం లోడ్‌తో వెళ్తున్న ఓ ట్యాంకర్‌ను వెంకటరమణ కాలనీ ఫ్లైఓవర్‌పై ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో ట్యాంకర్‌లో ఉన్న లివర్స్ ఫెయిల్ అయి.. హెచ్‌సీఎల్ ద్రవ పదార్థం మొత్తం లీకైంది. దీంతో జాతీయ రహదారిపై పడిన ఆమ్లం నుంచి ఘాటుతో పొగలు వ్యాపించాయి. దాంతో బస్సులో ఉన్న ప్రయాణికులందరూ దూరంగా పరారయ్యారు. ఫ్లైఓవర్‌పై నుంచి ద్రవం మొత్తం జారుకుంటూ సంతోష్‌నగర్ దాకా వెళ్లింది. ఈ మొత్తం రోడ్డంతా ఘాటైన వాయువులు వ్యాపించడంతో హైదరాబాదు వైపు నుంచి వచ్చే వాహనాలన్ని నిలిచిపోయాయి. ఒక్కసారిగా వాయువులు వ్యాపించడంతో ప్రమాదకరంగా ఉందని ఆందోళనలు చెందిన స్థానికులు, ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాలుగో పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వాయువు పెద్దగా ప్రమాదం కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ ను సర్వీసు రోడ్డుపైనుంచి మళ్లించారు. అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి బాలరాజు ఆధ్వర్యంలో ఓ ఫైరింజన్, సిబ్బంది ఆ యాసిడ్‌పై నీళ్లు చల్లించారు. అలాగే ట్యాంకరులో 36వేల లీటర్ల ఆమ్లం ఉండటంతో ఎట్టి పరిస్థితుల్లో ఆమ్లాన్ని డైల్యూట్ చేయాలి కాబట్టి దాన్ని నేలపైన అన్‌లోడు చేయాలి. దీంతో ట్యాంకర్‌ను ఉలిందకొండ వైపు తీసుకెళ్లి దూపాడు సమీపంలో ఓ గుంతలో పారబోశారు. అంత వరకు ట్యాంకర్ వెంట ఫైరింజన్ వెళ్తూ ఆ వాయువు వ్యాపించకుండా నీళ్ల చల్లుతూ జాగ్రత్తలు తీసుకున్నారు. దూపాడు సమీపంలో ఓ గుంతలో యాసిడ్ ఆమ్లాన్ని కింద పోసి ఆమ్లం డైల్యూట్ అయ్యేంత వరకు నీరు పోశారు. ఆ తర్వాత తిరిగి వెంకటరమణ కాలనీ వైపు వచ్చిన ఫైరింజన్లు వెంకటరమణ కాలనీ వైపు వచ్చి రోడ్డుపై ఉన్న ఆమ్లాన్ని మొత్తాన్ని శుభ్రం చేశారు. ఈ తతంగం సోమవారం ఉదయం వరకు సాగింది. మరో వైపు ఫ్యాక్టరీ యజమాన్యం కూడా ఆమ్లంతో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దానిపై కొంత పౌడర్ చల్లుతూ చర్యలు తీసుకున్నారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకపోవడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.



ప్రమాదంలో దెబ్బతిన్న ట్యాంకర్

'జొన్న రైతులను ఆదుకోవాలి'



నంద్యాల మున్సిపాలిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): జొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పంట వచ్చిన రెండు నెలల తర్వాత కొనుగోలు నిర్ణయాన్ని ప్రకటించిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తెరవడానికి నెల రోజులు తీసుకోవడం రాయలసీమ రైతాంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి తార్కాణం అని అన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా జొన్నలను సేకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గోదాములకు తెచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేయకుండా రోజుల తరబడి నిలిపి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో రైతులు గోదాముల దగ్గరే నిద్రాహారాలు మాని కాపలా ఉండాల్సి వస్తోందన్నారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు పడడంతో పాటు వాహనాల కిరాయి పెరగడం వల్ల అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. రాష్ట్రంలోని మిగతా ప్రాంతాలలో ధాన్యాన్ని విజయవంతంగా సేకరిస్తున్న ప్రభుత్వం రాయలసీమలో జొన్నల సేకరణ పట్ల పూర్తిగా ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు.

కాంట్రాక్ట్ ఏఈకి విధులు నిలుపుదల

- ఇన్‌చార్జి డీఈకి షోకాజ్ నోటీసులు

శ్రీశైలం, మే 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో కుర్చీల కొనుగోలులో జరిగిన అక్రమాలపై కాంట్రాక్ట్ ఏఈ భవన్‌కుమార్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఈవో శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా క్యూ కాంప్లెక్స్‌లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఎయిర్ పోర్ట్ కుర్చీలు నాణ్యతలేనివి కొనుగోలు చేశారని ఆదివారం ఆకస్మిక తనిఖీల్లో గుర్తిస్తూ ఇన్‌చార్జి డీఈ చంద్రశేఖర్‌శాస్త్రికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కలపరిలో అదుపులోకి రాని విషజ్వరాలు

చికిత్స పొందుతూ మరొకరి మృతి

ఆస్పరి, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలపరి గ్రామంలో విషజ్వరం బారిన పడ్డ పెద్ద శేకన్న(48) సోమవారం మృతి చెందారు. శేకన్నకు ఉపిరితిత్తులలో నీరు చేరడంతో కుటుంబ సభ్యులు కర్నూలులో చికిత్స చేయించారు. అయితే కోలుకోలేక మృతిచెందారు. ఇప్పటికే గ్రామంలో విషజ్వరంలో వెంకమ్మ(62) అనే మహిళ మృతిచెందిన విషయం విదితమే. కాగా గ్రామంలో వైద్యాధికారులు వైద్యశిబిరాన్ని తొల గించి, పీహెచ్‌సీకి రావాలని సూచించారు. ఇప్పటికీ ఆరుగురు వరకు బాధి తులు ఉన్నారు. విషజ్వరాలు 30 రోజులుగా అదుపులోకి రాకపోవడంతో ఆదోళన కనిపిస్తోంది. అదుపు చేసేందుకు స్థానిక వైద్యులు, కర్నూలు వైద్య సిబ్బంది చికిత్సలు చేసినా అదుపులోకి రాకపోవడంతో గ్రామస్థులు భయ పడుతున్నారు. కాగా చికున్‌గన్యా, విష జ్వరాలను అదుపు చేసేందుకు వైద్య పరీక్షలు, రక్త నమూనాలు సేకరించామని పీహెచ్‌సీ వైద్యుడు బాలకృష్ణ తెలిపారు. జ్వరాలు అదుపు కావడానికి సమయం పడుతుం దన్నారు. జ్వరపీడితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరణ ఇచ్చారు.

ఇల్లు రాసివ్వాలని మేనత్తపై కత్తితో దాడి

నంద్యాల టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): మేనత్తపై మేనల్లుడు కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం నంద్యాలలో జరిగింది. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఆత్మకూరు బస్టాండు చెందిన రెహమున్నీసాకు నూనెపల్లెలో రెండు ఇళ్లు ఉన్నాయి. అయితే ఆమె సోదరుడి కుమారుడు అబ్దుల్ రెహమాన్ తనకు తండ్రి లేడని, ఒక ఇంటిని తన పేరు మీద రాసివ్వాలని నిత్యం గొడవ పడేవాడు. అయితే ఆమె స్పందించడం లేదని సోమవారం నూనెపల్లె నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో రైల్వే పోలీసు స్టేషన్ సమీపంలోని నాగుల కట్ట వద్ద కత్తితో దాడి చేయడంతో రెహమున్నీసాకు తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పెద్దపులి దాడిలో ఆవు మృతి

వెలుగోడు, మే 5(ఆంధ్రజ్యోతి): వెలుగోడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలోని మద్రాస్ కెనాల్ పరిసరాల్లో సోమవారం తెల్లవారుఝామున ఆవుల మందపై పెద్దపులి దాడి చేసింది. పంటపొలాల్లో నిలిచిన శివనాయక్ ఆవుల మందపై పెద్దపులి దాడి చేయడంతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. అటవీశాఖ అధికారులు తమను ఆదుకోవాలని బాధి తుడు కోరారు. రేంజర్ ఎంఏ ఖాన్‌ను వివరణ కోరగా.. పెద్దపులి సంచ రించిన ప్రాంతాన్ని పరిశీలించామని, దాడిలో ఆవు చనిపోయింది వాస్త మేనని అన్నారు. ఆవు యజమానికి నష్టపరిహారం అందజేస్తామని చెప్పారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కర్నూలు జిల్లా ప్రైవేటు ఐటీఐ మేనేజ్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ దామోదర చౌదరి, జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంటు ఆదినారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఐటీఐ.ఏపీ.జీవో వీ.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పదోతరగతి పాసైన వారు, ఇంటర్, డిగ్రీ పాసైనా, ఫెయిలైనా వారు కూడా ఇందుకు అర్హులన్నారు. ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సమీప ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ విద్యా సంస్థల్లో సంప్రదించాలని తెలిపారు.

ANDHRA PRADESH SOLAR POWER CORPORATION PVT LTD
(A Joint venture company of Government of A.P and Government of India)

e - Procurement Tender Notice

APSPCL invites tender for the work of **"Conducting special repair works at control room of pooling station 02 at Kurnool Ultra Mega Solar Park (1000MW) of Nandyal & Kurnool District, A.P."** Approximate Value of Work **Rs. 19.66 Lakh.** Schedule Available Date & Time: **05.05.2025 from 05.00 P.M.** For details visit: **www.apspcl.ap.gov.in** (or) **www.apeprocurement.gov.in**



COMPUTER EDUCATION
NICE COMPUTER SUMMER COURSES: M.S.Office, DTP, TALLY, C++, Phython, Photoshop, DCA, PGDCA etc. Cont: 1st Lane, V.R.Colony, KNL. 9396861308
AJL-236512

ముస్లీం వివాహ సంబంధాలు
బిజినెస్, సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ టీచర్స్, బ్యాంక్, పోస్టల్, రైల్వే, పోలీస్. డిఫెన్స్, డాక్టర్ సంబంధాలు కలవు. స్టార్ మ్యారేజ్ బ్యూరో, నంద్యాల జిల్లా. సెల్ : 87908 44959. (2వ సంబంధాలు కలవు)
AJL-236385

FLATS FOR SALE
కల్లూరు ఎస్టేట్ సుఖీభవ హాస్పిటల్ దగ్గర LAR అపార్ట్‌మెంట్ గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న 2BHK ఫ్లాట్ 38 Lakhs కు కార్ పార్కింగ్ తో కలిపి ఫ్లాట్స్ అమ్మబడును. సంప్ర: సెల్: 94415 40658
AJL-236441

CHANGE OF NAME
SUBBALAKSHMMA BUGADA (Old Name) H.No 71/55, Ramireddy thatha veedhi, Kallur Mandal, Kurnool dist, AP. Hereby I Declare that I have changed my name as SUBBALA KSHMMAKURNI (New Name) W/o K.Ravi Kumar H.No 71/55, Ramireddy thatha veedhi, Kallur Mandal, Kurnool dist, AP.
AJL-236454

కార్పెంటర్స్ కావలెను
కడప టౌన్‌లో ఫర్నిచర్ వర్క్స్ చేయుటకు అనుభవంగల వర్కర్స్ కావలెను. వసతి కల్పించబడును. సంప్ర : 70137 33146
Ajc-000

బంగారం కొనబడును
మీబంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టు మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర:7382114647.
AJA-237536

WANTED
Hiring for Distance Education Academy Partner, SRI SAI EDUCATIONAL CONSULTANTS, KADAPA, Cell : 98855 11226
AJC-233730

FOR ADVERTISEMENTS CONTACT. Cell: 99854 11369

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

వేడుక ఏదైనా... సందర్భం ఎటువంటిదైనా
- వివాహ వార్షికోత్సవం
- స్వదేశీ, విదేశీయానం
- లీగల్ ప్రకటనలు
- పదవీ విరమణ
- శ్రద్ధాంజలి
- జన్మదినం
- షష్టిపూర్తి
- జయంతి
- వర్ధంతి
- క్లాసిఫైడ్స్

ఆంధ్రజ్యోతి
ప్రకటనల కొరకు సంప్రదించండి
మీ స్నేహితులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులకు తక్కువ ఖర్చుతో ఆంధ్రజ్యోతి లోప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలియచేయండి.
9985402121

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

కమిషనర్ రవీంద్రబాబు



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్ర మానికి 8 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఓ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య పాల్గొన్నారు.

గూడూరు: ప్రజా సమస్యలను పరిష్కరిం చాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్‌కు మూడు అర్జీ లు సమర్పించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: తహసీల్దార్

సి.బెళగల్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ పురుషోత్తం హెచ్చరిం చారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డుదారులకు బియ్యం సక్రమంగా అందేలా చూడాలన్నారు. బియ్యం తూకాల్లో తక్కువ వస్తున్నాయని లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వీర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు అగ్రికల్చర్, మే 5(ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ ఉద్యోగు లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్ సోర్సింగ్ సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు పీవీ కిరణ్, జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ట్రెజరర్ శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ప్రతినిధులు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవీ కిరణ్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మార్కెట్ కమిటీలో పని చేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వివిధ కారణాలతో తొల గిస్తున్నారని, గతంలో ఇదే పరిస్థితి ఎదుర్కొన్నప్పుడు హైకోర్టును ఆశ్రయించి అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నామని, ఇప్పుడు కూడా కోర్టుకు వెళ్లే పరిస్థితి తీసుకురావద్దని అన్నారు.

భూసార పరీక్షలతో అధిక లాభాలు: ఏవో

సి.బెళగల్, మే 5(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలతో అధిక లాభాలు సాధించవచ్చు అని మండల వ్యవసాయ అధికారి మల్లేష్ కుమార్ రైతులకు సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలను తప్పనిసరి చేయించుకోవాలన్నారు. ఈసమా వేశంలో రైతులు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలి

సి.బెళగల్, మే 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలని ఏఈ సుకుమార్ రైతులకు, గృహ యజమానులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలో విద్యుత్ వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెళ్లిళ్లకు విద్యుత్ వినియోగించే ముందు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో రైతులు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఘనంగా కారల్ మార్క్స్ జయంతి



కారల్ మార్క్స్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు నేత కారల్ మార్క్స్ జయంతి వేడుకలను సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం సీఆర్ భవన్‌లో నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యలు హాజరై కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగరాజు, కుమార్, శ్రీనివాసులు, షాపిర్‌బాషా పాల్గొన్నారు.

'నమస్తే'తో వేస్ట్ పికర్స్‌కు గుర్తింపు

ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్(నమస్తే) పథకం వ్యర్థాలను ఏరుకునే పికర్స్‌లకు గుర్తింపు ఇచ్చినట్లు కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కౌన్సిల్ హాలులో నమస్తే కార్యక్రమ ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. కె.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ వ్యర్థాలను సేకరించే వ్యక్తులు(వేస్ట్ పికర్స్) పారిశుధ్య కార్మికులను(సఫాయి కర్మచారి) అధికారికంగా గుర్తించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నమస్తే పథకాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించాయన్నారు. వ్యర్థాలను సేకరించే వ్యక్తులు వాహనాల కొనుగోలుకు రూ.5 లక్షల వరకు రాయితీతో కూడిన రుణాలు కూడా పొందవచ్చన్నారు. దీని కోసం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు నమస్తే కార్యక్రమం ఆర్‌ఓ 9492469964కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ స్టేట్‌కో ఆర్డినేటర్ అనిల్, ప్రాజెక్టు డైరెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

సి.బెళగల్, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మనదొడ్డి సమీపంలోని తుంగభద్ర నదిలో నుంచి తెలంగాణ రాష్ట్రంలోని అయిజ మండలానికి ట్రాక్టర్ అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ తుంగభద్రనది తీరా గ్రామాల నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ముందస్తు అడ్మిషన్ల ప్రచారాన్ని నిలిపివేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్

కర్నూలు కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి): నూతన విద్యాసంవత్సరం 2025-26 ప్రారంభం కాకముందే జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు ప్రచారంతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మహేష్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు సెలవులో కూడా నూతన విద్యా సంవత్సరం పాఠ్యపుస్తకాలు కొనుక్కోవాలని, యూనిఫాం, నూతన విద్యాసంవత్సరం ఫీజు కొంత చెల్లించాలని పాఠశాల యజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు.

● జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్‌కు కేటాయించిన క్వార్టర్స్ అప్పగించాలని కర్నూలు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ గుప్తా కలెక్టర్‌ను కోరారు. గత కలెక్టర్ వీరపాండియన్ ప్రభుత్వ క్వార్టర్స్ 5, 6 కేటాయించారన్నారు. ఆ క్వార్టర్స్‌ను అప్పగించాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టులు విజయ్, బాషా, శివ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● నగరంలోని సి.క్యాంపు రైతుబజారులో కూరగాయలను అమ్ముకునేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను రైతులు కోరారు. రైతుబజారులో రైతులకు కాకుండా కొంతమంది దళారులకు అనుమతి ఇవ్వడంతో నిజమైన వారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, అంజనేయులు, కుమారస్వామి పాల్గొన్నారు.

● రేడియో స్టేషన్ సమీపంలోని శాంతినగర్‌లో మురుగు కాలువలు సరిగా లేవని, వర్షం వచ్చినపుడు నీరు రోడ్లపైన నిల్వ ఉండి ప్రజలు నడవడానికి ఇబ్బందికరంగా ఉంది. వీటిపై చర్యలు తీసుకోవాలని పట్టణ, పౌర సంక్షేమ సంఘం సభ్యులు పుల్లారెడ్డి, రంగస్వామి, శ్రీరాములు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

● ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక ప్రతిపాదనపై పనిచేస్తున్న కార్మికులకు ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని ఏఐటీ యూసీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్, కార్యదర్శి ఎస్.మునెప్ప, సభ్యుడు చంద్ర శేఖర్ కోరారు. సోమవారం కలెక్టర్‌కు వారు వినతిపత్రం సమర్పించారు.

● తనకు వ్యవసాయమే జీవనాధారమని, ఎడమ కాలికి ఇన్‌ఫెక్షన్ వచ్చి కాలు మొత్తం తీసేశారని, ఆర్టిఫిషియల్ కాలును ఇప్పించాలని ఎమ్మిగనూరు మండలం సిరిమానుదొడ్డి గ్రామ నివాసి గిడ్డయ్య కలెక్టర్ కోరారు.

● సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏపీసీపీఎస్‌ఈఏ ఉద్యోగులు కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగుల పాత పెన్షన్ పునరుద్ధరించాలని, డీఏ బకాయిలు, కేసులు ఎత్తివేయా లని అన్నారు. అనంతరం విజయవాడలో సెప్టెంబరు 1న నిర్వహించ బోయే పెన్షన్ మార్చ్ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బాజీ పఠాన్, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షులు శ్రీధర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి నరసింహ, రాము, కృపా నందం పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి



ర్యాలీ నిర్వహిస్తున్న శాంతి కమిటీ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తక్షణమే కాల్పులను విరమించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని జిల్లా ప్రజా సంఘాల శాంతి కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ ముందు గల గాంధీ విగ్రహం వరకు శాంతి కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వం మావోయిస్టుల పేరుతో చేస్తున్న దాడులలో అమాయక ఆదివాసీలు బలై పోతున్నారని, ప్రభుత్వం తక్షణ మే కాల్పు ల విరమణ పాటించి, మావోయిస్టులతో శాంతి చరన్యలు జరపాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ అంతిమ యుద్ధం పేరుతో గత జనవరి నుంచి ఇంత వరకు ఐదువందల మంది ఆదివాసీలు, మహిళలను బలితీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా అభ్యుదయ సంస్థ నాయకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మధ్య భారతంలోని అడవుల్లో ఉన్న అపార సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలపై, వారికి అండగా ఉంటున్న మావోయిస్టులపై దాడులు చేస్తుందన్నారు. జిల్లా పౌర హక్కుల సంఘం కార్యదర్శి అల్లాబకాష్ మాట్లాడుతూ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలను నిలిపివేసి, శాంతి చర్చలు చేస్తున్నారని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సొంత ప్రజలపై యుద్ధం చేస్తూ ఉందని, మేధావులు కోరినట్లు తక్షణమే మావోయిస్టులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కరరెడ్డి, డీటీఎఫ్‌రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం ఏసేపు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, పీఓపీ, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, పౌర హక్కుల సంఘం, డెమో క్రటిక్ టీచర్స్ ఫెడరేషన్, మహిళా సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్యంలోనే హిందూ సనాతన ధర్మాన్ని నేర్పించాలి

వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్



ప్రసంగిస్తున్న మాళిగి భానుప్రకాశ్

కర్నూలు కల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు బాల్యంలోనే హిందూ సనాతన ధర్మాన్ని నేర్పించాలని వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్ అన్నారు. సోమవారం నగరంలోని హరిశ్చంద్రనగర్‌లోగల సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో, వీహెచ్‌పీ అనుబంధ సంస్థ 'విజ్ఞాన వికాస్ బాల సంస్కార కేంద్రం' ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా పాఠశాల స్థాయి బాలలకు కొనసాగిన బాలల వేసవి శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా మాళిగి భానుప్రకాశ్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు దైవ భక్తితోపాటూ దేశ భక్తిని అలవర్చుకోవాలని సూచించారు. అంతకుముందు బాల సంస్కార్ విద్యార్థులు స్థానిక వీధుల్లో బాలరాముని విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు, మాతృశక్తి సంస్థ జిల్లా కన్వీనర్ పావని, వీహెచ్‌పీ నాయకులు కరణం సుధాకర్, శిక్షకులు మాళిగి నారాయణాచార్యులు, వ్యాసరాజ్ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.35 వేలు నిర్ణయించాలి: ఏఐటీయూసీ



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలు నిర్ణయించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. మునెప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నా రని విమర్శించారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించినప్పటికీ అది అమలు కావడం లేదన్నారు. అనంతరం సునయన ఆడిటోరియంలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు వెంకటేష్, ఉప ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఈశ్వర్, నాగరాజు, జయరాం పాల్గొన్నారు.

షర్మిల జిల్లా పర్యటనను విజయవంతం చేద్దాం

కర్నూలు అర్బన్, మే 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 11న పీసీసీ అధ్యక్షురాలు వైస్ షర్మిలా జిల్లా పర్యటనను విజయవంతం చేద్దామని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జిలానీ బాషా పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే దిశగా అన్ని జిల్లాల పర్యటనల్లో భాగంగా ఈనెల 11న మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని నిర్వహించే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరుకానున్నారని తెలిపారు. ఈసమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, అనంత రత్నం, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న, బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, జిల్లాయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేంద్ర నాయుడు, ప్రమీల పాల్గొన్నారు.

డ్యాన్స్‌తో ఫిట్‌నెస్: టీజీ వెంకటేశ్



మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్టూడియో నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, మే 5(ఆంధ్రజ్యోతి): శారీరక వ్యాయామానికి డ్యాన్స్ ఫిట్‌నెస్ ఎంతో అవసరమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. సోమవారం నగరంలోని ప్రకాశ్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రిథమ్ డ్యాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో ప్రారంభోత్సవానికి టీజీ వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగరంలో రిథమ్ డ్యాన్స్ అండ్ ఫిట్‌నెస్ స్టూడియో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్టూడియో నిర్వాహకులు టీజీ వెంకటేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యుడు కన్నా, వీరేంద్ర, స్టూడియో నిర్వాహకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా గోవిందరెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న గోవిందరెడ్డి

ఓర్వకల్లు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లుకు చెందిన టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మండలంలోని నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకోటేశ్వరరావు, ప్రతాప్, రామమద్దిలేటి, అబ్దుల్లా, అల్లాబాబు, యాసీన్‌బాషా, రామకోటేశ్వరరావు, శ్రీరామిరెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత పనులు

కర్నూలు న్యూసిటీ, మే 5(ఆంధ్రజ్యోతి): నగర వ్యాప్తంగా ప్రధాన మురుగు కాలవల్లో పూడికతీత పనులు ప్రారంభించినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రూ.1.06 కోట్లతో 150కి పైగా ప్రత్యేక సిబ్బందితో 52 వార్డుల్లో పూడిక తీత పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పటికే పాతబస్తీలో పూడికతీత పనులు పూర్తి అయ్యాయని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పూడికతీత పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వైద్యుల సంతకాలు ఫోర్జరీ

ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు బ్రహ్మాజీ మాస్టర్



మాట్లాడుతున్న బ్రహ్మాజి మాస్టర్

కర్నూలు హాస్పిటల్, మే 5(ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం కర్నూలు మెడికల్ కాలేజీ క్యాంటీన్ అగ్రిమెంటు ఐదేళ్లు ఉండాలని, అలా కాకుండా 30 ఏళ్ల అగ్రిమెంటును సంఘంతో సంబంధం లేని ఓ డాక్టర్ వైద్యుల సంతాకాలను ఫోర్జరీ చేశారంటూ ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (కేఎంసీ యూనిట్) అధ్యక్షుడు డా.పి.బ్రహ్మాజీ మాస్టర్ ఆరోపించారు. సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ ఫోరెన్సిక్ విభాగంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రిటైర్డు అయిన వ్యక్తులు, సర్వీసులో లేని వైద్యులు క్యాంటీన్‌ను నిర్వహించడం సరికాదన్నారు. 2013 నుంచి క్యాంటీన్ అద్దె రూ.4వేలు చెల్లిస్తున్నారని, ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి అద్దె ఎందుకు పెంచడం లేదన్నారు. ఏపీజీడీఏకు చెందిన క్యాంటీన్‌ను 30 ఏళ్ల లీజ్‌కు ఇచ్చే అధికారం ఎవరికీ లేదన్నారు. క్యాంటీ న్‌పై 30 ఏళ్ల లీజ్ ఉందంటూ కోర్టుకు వెళ్లారని, ఇందులో వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేశారని ఆరోపించారు. మంగళవారం క్యాంటీన్‌ను స్వాధీనం చేసుకుంటామన్నారు. సమావేశంలో ఏపీజీడీఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామశివ నాయక్, ఉపాధ్యక్షులు ఎస్.సోమప్ప, కోశాధికారి డమాం శ్రీనివాసులు, సీనియర్ నాయకులు రామ కృష్ణ నాయక్, జాయింట్ సెక్రటరీ శారద, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డికి సన్మానం



విష్ణువర్ధన్ రెడ్డిని పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, మే 5(ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్‌గా నియమితులైన విష్ణువర్ధన్‌రెడ్డిని ఆర్ కానాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సన్మానించారు. సోమవారం గూడూరు మండలం ఆర్ కానాపురం సర్పంచ్ మునిస్వామి, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, టీడీపీ నాయకులు మన్యంకొండ, సోమేశ్వర రెడ్డిలు టీడీపీ శ్రేణులతో కర్నూలుకు వెళ్లి విష్ణుకు బొకే అందజేసి సన్మానించారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



సారా బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

ఓర్వకల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడుంబాయి తండా గ్రామంలో సోమవారం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 16 లీటర్ల నాటు సారా, బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కర్నూలు రాజశేఖర్‌గౌడు, ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రహాస్, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు సత్కారం

కర్నూలు స్పోర్ట్స్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థలోని యోగా హాలులో మాస్టర్ సతీష్ ఆధ్వర్యంలో మంగళవారం తైక్వాండో క్రీడాకారులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ శమంతకమణి సాయి హాస్టల్‌కు ఎంపికైన నలుగురు క్రీడాకారులైన బి.శ్యాంసుందర్, బి.కార్తిక్, బి.కమలేశ్వర్, ఎం.జ్ఞానేశ్వర్‌లను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ నగరంలోని వివిధ ప్రాంతాల్లో సతీష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో క్రీడాకారులు ఉన్నత స్థాయి పోటీలతోపాటు సాయి హాస్టల్‌కు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జి.శ్రీనివాసులు, సతీష్ కుమార్, వీరేష్ పాల్గొన్నారు.


పొగాకు రైతులకు అండగా ఉంటాం



పొగాకు గోడౌన్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు, మే 5(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులకు అండగా ఉంటా మని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఓర్వకల్లులోని ఐటీసీ, జీపీ పొగాకు విక్రయ గోడౌన్లను ఆయన పరిశీలించారు. అనంతరం రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పొగాకు ధర క్వింటం రూ.7వేల నుంచి రూ.8వేలు వేస్తున్నారని, తాము తీవ్ర అన్యాయం జరుగుతుందని కాటసానితో రైతులు మొర పెట్టుకున్నారు. కంపెనీ యజమానులతో కాటసాని మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది 10వేల ఎకరాలకు పైగా పొగాకు సాగు చేశారన్నారు. పొగాకు వేసే ముందు క్వింటం రూ.15వేలకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన కంపెనీలు అమ్మేసరికి రూ.8వేల నుంచి రూ.10 వేల వరకు ధర వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కర్నూ లు మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న, నాయకులు నాగతిరుపాలు, వెంగన్న, హరినాథరెడ్డి, రమణారెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందకండి : ఏవో



రైతులతో మాట్లాడుతున్న ఏవో

కోడుమూరు రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): పొగాకు పంట సాగు చేసిన రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయాధికారి రవిప్రకాష్ గౌడ్ తెలిపారు. మండలంలోని ఎర్రదొడ్డి, చిల్లబండ, అనుగొండ గ్రామాల్లో పొగాకు రైతులను కలిసి ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరించారు. పొగాకు రకం, కంపెనీ అగ్రిమెంట్‌పై వివరాలు తెలుసుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ అగ్రిమెంట్ లేనందున ఐటీసీ కంపెనీ కొనుగోలు చేయలేదని తెలిపారు. మరికొందరు గ్రేడ్ పేరుతో వెనక్కి పంపారని అన్నారు. అనంతరం వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతుల వద్ద మిగిలిపోయిన పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, ఇందులో భాగంగా రైతుల జాబితాను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలియజేశారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ఆదోని అగ్రికల్చర్/రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని రైల్వే గేట్ అవతల ఉన్న సాయి నగర్ కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఐ కార్యదర్శి సుదర్శన్, సహాయ కార్యదర్శి విజయ్ కోరారు. సోమవారం విద్యుత్ ఏఈ రాజుకు వినతిపత్రం అందజేశారు. 200 కుటుంబాలు నివసిస్తున్నారని, స్తంభాలు ఉన్నా, తీగెలు ఏర్పాటు చేయలేదన్నారు.

పురపాలక స్థలాలను కాపాడండి

ఆదోని టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): కొత్త బస్టాండ్ సమీపంలోని ఆర్టీసీ కాలనీ, కవర్ధి నగర్ కాలనీలల్లో పురపాలక శాఖకు చెందిన ఖాళీ స్థలాలను కబ్జా నుంచి కాపాడాలని టీడీపీ మండగిరి ఇన్‌చార్జ్ శ్రీనివాస ఆచారి కోరారు. సోమవారం మునిసిపల్ కమిషనర్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు.

ఫంక్షన్ హాల్ యజమానికి జైలు శిక్ష

ఆదోని అగ్రికల్చర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంటర్నేషన్ ఫంక్షన్ హాల్ లిఫ్ట్ తెగిపడి వ్యక్తి మృతిచెందిన ఘటనలో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సోమవారం అడిషనల్ జేఎఫ్ సీఎం కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. రెండో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. 2017లో ధర్మవరానికి చెందిన గైక్వాడ్ చంద్రశేఖర్ బంధువులు పెళ్లి కోసం ఫంక్షన్ హాల్‌ను అద్దెకు తీసుకున్నారు. పెళ్లి ముగిశాక తిరిగి వెళ్ళే సమయంలో లిఫ్ట్ తెగి కింద పడి గోవర్దన్ అనే వ్యక్తి చనిపోగా, ఇద్దరు గాయపడ్డారు. ఫిర్యాదు మేరకు నాటి టూటౌన్ సీఐ గంటా సుబ్బారావు కేసు దర్యాప్తు చేసి, కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహేశ్వరి కేసుపై వాదనలు వినిపించారు. విచారణలో యజమాని నిర్లక్ష్యమే కారణమని రుజుకావడంతో అన్వర్‌బాషాకు ఏడాది జైలు,రూ.10వేల జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

VEHICLES FOR SALE

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, ఆదోని బ్రాంచి.

VEHICLE NO.	DESCRIPTION	MODEL
AP27TX1425	TATA XENON PICKUP	2014
AP21TW5692	AL DOST	2012
AP40AY8090	ELEVATE ZX	2023
AP16TX0034	EICHER 11.10 FBT	2012
AP21BN4878	MAHINDRA SCORPIO S2	2017
AP39UJ7803	MAHINDRA XYLO	2017
AP04TX2015	ASHOK LEYLAND DOST	2015
AP39UB6975	MAHINDRA XYLO	2018
AP02TH0208	AL DOST PLUS	2018
AP21TZ9801	AL DOST	2016

వేలము వేయు ప్రదేశం :
శ్రీరామ్ ఆటోమాల్, పంచలింగాల,
NH-44, అలంపూర్ టోల్‌గేట్ దగ్గర, కర్నూలు.
వేలము వేయు తేదీ : 08-05-2025 (గురువారం)
96666 89446, 97033 17432, 08512-253360

సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే శ్యాంబాబు
- సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

మద్దికెర, మే 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం మండలంలోని పెరవలి గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. 75 సెంట్ల స్థలం ఇచ్చిన పెరవలి గ్రామా నికి చెందిన దాత ఈడిగ రంగన్నను సన్మానించారు. సబ్ స్టేషన్ ఏర్పాటుతో పెరవలి, బసినేపల్లి, మదనం తపురం, రాంపురం, రాంపురం కొట్టాల్లో విద్యుత్ అంతరాయం, లోవోల్టేజీ సమస్య ఉండదన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇంత వరకు ఏ మండలానికి కూడా సబ్ స్టేషన్ మంజూరు కాలేదని, సీఎం చంద్రబాబు చొరవతో విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేశారన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

జూన్‌లో తల్లికి వందనం పేరుతో కుటుంబంలో ఎంత మంది విద్యార్థులు చదువుతుంటే అందరికీ రూ.15 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోక రాష్ట్రం అల్లకల్లోలమైందన్నారు. ప్రధాని మోదీ సారథ్యంలో రాజధాని అమరావతి అభివృద్ధిలో పరుగులు తీస్తుందన్నారు. గడిచిన పది నెలల్లో సంక్షేమం, అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్నామన్నారు. మద్దికెర మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి 7వేల మంది రైతులకు పంట నష్టపరిహారం అందిస్తున్నామని, హంద్రీనీవా నీటితో చెరువులను నింపేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ ఉమాపతి, ఏఈ మహ్మద్ రఫీక్, తహసీల్దార్ హుశేన్ సాహెబ్, మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, ప్రముఖ నాయకుడు పారా విశ్వనాథ్, సర్పంచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాల కల్పనే లక్ష్యం

- ఆదోని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గౌస్

ఆదోని టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడమే తన లక్ష్యమని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ముల్లా మహమ్మద్ గౌస్ అన్నారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో మునిసిపల్ రెవెన్యూ, శానిటేషన్, సచివాలయాల సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పట్టణంలో పారిశుధ్య సమస్యలు, తాగునీటి సరఫా, రహదారి మరమ్మతులు, డ్రైనేజీపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యల పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ నరసింహులు కౌన్సిలర్లు ఫయాజ్ అహ్మద్, బాలాజీ యాదవ్, అశోక్, వాసిమ్, గట్టు ఇంతియాజ్, రామలింగేశ్వర యాదవ్, మొంబత్తి స్వామి, మధు, భాస్కర్, గోవిందు, ఇబ్రహీం వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి : సబ్ కలెక్టర్

ఆదోని, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను అదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయవద్దని, ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచాలని సూచించారు. సోమవారం కార్యాలయంలో మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని సంబంధిత శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన సమస్యలు కొన్ని

1. ఆదోని పట్టణం శివశంకర్ నగర్ కాలనీలో వీధిలైట్లు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించాలని స్థానికులు సరోజ, భారతి, హసీనా భాను, అర్జీ సమర్పించారు.
2. ఆదోని పట్టణానికి చెందిన మధుసూదన్ తనకు మండగిరి గ్రామ పంచాయతీ సర్వే నెం.32లో 2.37 ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, అలాగే సర్వే నెం.30లో 2.48 ఎకరాల భూమి ఉండగా ఆన్‌లైన్‌లో 2.40 ఎకరాలే చూపిస్తోందని, పరిష్కరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయానలి అర్జీ ఇచ్చారు.
3. గోనెగండ్ల మండల కేంద్రానికి జి.రాజు తనకు సర్వేనెం. 440/2ఏలో 6.50ఎకరాలు, అలాగే సర్వే నెం.440/2బిలో



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

4.20ఎకరాల భూమి ఉందని, సర్వే చేసి హద్దులు చూపాలని అర్జీ సమర్పించారు.

4. ఆదోని పట్టణంలోని బాలాజీ ఎస్టేట్, ఆదర్శ ఎస్టేట్‌లో కనీస సౌకర్యాలైన రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ లేక ఇబ్బంది పడుతున్నామని, పరిష్కరించాలని కాలనీవాసులు అర్జీ ఇచ్చారు. సర్వేయర్లు శ్రీనివాస రాజు, వేణుసూర్య, డీఎల్డీవో రమణ రెడ్డి, షఫీ ఉల్లా, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫీ, డిప్యూటీ డీఎంహెచ్వో సత్యవతి, డిప్యూటీ డీఈవో వెంకటరమణ రెడ్డి, ఉప తహసీల్దారు వలిబాషా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- రూ.4 కోట్ల రోడ్డు పనుల ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు అన్నారు. సోమవారం ఆదోని మండలం పెద్ద పెండేకల్లు నుంచి 4 కి.మీ.ల మేరకు రూ.4కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ప్రారం భించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ పెద్ద పెండేకల్లు రోడ్డు పూర్తయితే ఐదు గ్రామాల ప్రజలు నేరుగా జిల్లా కేంద్రానికి వెళ్లే అవకాశం ఉంటుంద న్నారు. పట్టణాభివృద్ధితో పాటు నియో జకవర్గ అభివృద్ధి కూడా ముఖ్యమన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకున్నా, ఆదోనికి నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి పేరు తీసుకురావడమే తన లక్ష్యమన్నారు. భూపాల్ చౌదరి, రామస్వామి, రంగన్న, అరెకల్ రామకృష్ణ, మల్లన్న, ఉపేంద్ర, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

గడ్డం నాగరాజుకు నివాళి

ఆలూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో మృతిచెందిన టీడీపీ నాయకుడు గడ్డం నాగరాజు మృతదేహానికి సోమవారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ నివాళి అర్పించి, అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులకు రూ.10 వేలు అందించారు. కుటుంబ సభ్యులు ఓదార్చారారు, నాగరాజు మృతి పార్టీకి తీరనిలోటన్నారు. అనంతరం



నివాళి అర్పిస్తున్న వీరభద్రగౌడ్

ఎమ్మెల్యే విరూపాక్షి నివాళి అర్పించారు.

రైతులకు అప్పగించాలి

తుగ్గలి, మే 5 (ఆంధ్రజ్యోతి): గత రీసర్వేలో పేర్లు మార్చిన భూములను తిరిగి రైతులకు అప్పగించాలని సీపీఎం అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, కొండారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రీసర్వేలో రైతుల పట్టా భూములను కూడా ప్రభుత్వ భూమి, చుక్కలభూమి, డీసీ ల్యాండ్‌గా ఆన్‌లైన్‌లో చూపుతున్నారన్నారు. ఇలా పేర్లు మార్చడంతో రైతులు బ్యాంకులో తీసుకున్న రుణాలు రెన్యువల్ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణాలు మొత్తం చెల్లించాలని, బ్యాంకు అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బలరాముడు, రైతులు వెంకటేష్ నాయక్, బాలు నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలి

పత్తికొండ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో రైతులకు 90శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు ఇవ్వాలని రైతు సంఘం కార్యదర్శి సిద్దలింగప్ప డిమాండ్ చేశారు. సోమవారం వ్యవసాయ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. పత్తికొండ వెనుకబడిన ప్రాంతమని, రైతులు వర్షాధారంపై పంటలు సాగు చేస్తున్నారన్నారు. పెద్దముని, వెంకట్రామిరెడ్డి, నెట్టికంటయ్య, మాధన్న, గుండుబాషా, మద్దిలేటి, హనుమన్న పాల్గొన్నారు.

సూర్యఘర్ వరం

దేవనకొండ, మే 5 (ఆంధ్రజ్యోతి): సూర్యఘర్ పథకం విద్యుత్ వినియోగదారులకు వరమని విద్యుత్ ఏఈ రవీంద్ర, వెలుగు ఏపీఎం నర్సన్న అన్నారు. సోమవారం మండ లంలోని పి.కోటకొండ గ్రామంలో పీఎం సూర్యఘూర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీసీ, ఒసీలకు 50 శాతం



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

రాయితీ, 50 శాతం బ్యాంకు రుణంతో ఏర్పాటు చేస్తామన్నారు



దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి: సీపీఎం



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్/రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల రెవెన్యూ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో సీపీఎం మండల కార్యదర్శి గోవిందు, నాయకులు రాముడు మాట్లాడుతూ మండల రెవెన్యూ కార్యాలయంను కమర్షియల్ కార్యాలయంగా మార్చేశారన్నారు. పేద ప్రజలు,మహిళలు సమస్యల పరిష్కారానికి రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్న అధికారులు నిమ్మకు నిరెత్తినట్లు ఉండడం దారుణం అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో రమేష్, అబ్దుల్లా, కాలప్ప తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలలను పూర్వస్థితిలోనే కొనసాగించాలి'



ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, మే 5(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను పూర్వస్థితిలోనే కొనసాగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాటూరు రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనం ముందు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సంఘం అర్బన్‌శాఖ అధ్యక్షులు శ్రీనివాసులు అధ్యక్షతన ధర్నా నిర్వహించి తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. యువగళం పాదయాత్రలో నారాలోకేష్ 3,4,5 తరగతుల విలీనాన్ని నిలిపివేసి పాఠశాలలను పూర్వస్థితిలో కొనసాగిస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీ నెరవేర్చకపోగా ఫౌండేషన్ పాఠశాలల పేరుతో 1,2 తరగతులకే పరిమితం చేశారన్నారు. తక్షణమే ఈ విధానాలకు స్వస్థి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయులు కాశిం, రాష్ట్ర కౌన్సిలర్ పరుశురాము, జిల్లా కార్యదర్శి రంగనాథ్, వీరేష్, జిల్లా ఆడిట్ కన్వీనర్ రాఘవేంద్ర,హేమంత్‌కుమార్, శ్రీనివాసులు,జెట్టెప్ప పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి శ్రీమఠానికి తాగునీరు

మంత్రాలయం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు వేసవిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు శ్రీమఠం అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. సూగూరు ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి రూ.7.50 లక్షల ఖర్చుతో ఏడు ఇంచుల పైపులైన్ ద్వారా శ్రీమఠానికి అందిస్తున్న వ్యాసతీర్థ మంచి నీటి ప్రాజెక్టు సంపులోకి నీటి రవాణాను సరఫరా చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ ఆదేశాల మేరకు ఏఈఈ వెంకట్రాముడు, శ్రీమఠం మేనేజర్ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, శ్రీహరిలు పైపులైన్ల పనులు పూర్తి చేయించి రోజుకు 2.50 లక్షల లీటర్ల నీటిని సరఫరాను సోమవారం ప్రారంభించారు. దీంతో వేసవిలో భక్తులకు అవసరమైన నీటి సరఫరా సమస్య తాత్కాలికంగా తగ్గిందని మఠం అధికారులు తెలిపారు. భక్తుల కోసం రూ.7.50 లక్షలు ఖర్చు చేసి సూగూరు ఎస్‌ఎస్ ట్యాంకు నుంచి పైపులైన్లు వేసి భక్తులకు తాగునీరు అందుబాటులోకి తెచ్చిన అధికారులను పీఠాధిపతి అభినందించారు.



నీటిని సరఫరా చేయిస్తున్న అధికారి

ఘనంగా మే డే వేడుకలు

ఎమ్మిగనూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగు బాల గ్రామంలో సీపీఐ ఎంఎల్ చంద్రాపుల్లారెడ్డి పార్టీ రైతు కూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ శాంసన్, దావీదు అధ్యక్షతన 139వ మే డే దినోత్సవ వేడుకలు సోమవారం జరుపుకున్నారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనిఫ్ మాట్లాడుతూ కార్మికులు ఎనిమిది గంటలు పని విధానానికి ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం కాల రాస్తోందన్నారు. రాజు, ప్రభుదాస్, ఆనంద్, పెద్దరత్నం పాల్గొన్నారు.

శిథిలావస్థలో భవనం

ఎమ్మిగనూరు టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో ఉన్న క్షయ నివారణ కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. వైద్య సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అవరణలో 15ఏళ్ళ క్రితం ఈ భవనాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ క్షయ నివారణ వైద్య అధికారులు రోగులకు చికిత్స అందిస్తున్నారు. భవనం గోడలు పగుళ్ళు వచ్చి ఎప్పుడు కూలిపోతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. హాలులో భూమి లోపలకు కుంగిపోయి బండలు చీలి పొయాయని, పాములు వస్తున్నాయని సిబ్బంది వాపోయారు. నూతన భవనం నిర్మించాలని సిబ్బంది, రోగులు కొరుతున్నారు.



శిథిలమైన భవనం

ప్రశాంతంగా దేవర జరుపుకోవాలి: ఎస్‌ఐ

నందవరం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగలదిన్నెలో దేవర ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ కేశవ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో మంగళవారం, బుధవారం ఎలాంటి గోడవలకు పోకుండా అన్నదమ్ముల్లా కలసి మెలిసి దేవర జరుపుకోవాలన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూజాతర జరుపుకుని 43 ఏళ్ల అయ్యిందని మళ్లీ ఇప్పుడు జరుపుకుంటున్నామని ఇంటింటికి ఒకటి, రెండు పొట్టేళ్లు వదులు కున్నారని అందరు ప్రశాంతంగా జరుపుకుంటారని తెలిపారు. ఘర్షణకు తావులేకుండా పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

క్లస్టర్‌పై చేనేతల ఆశలు

- సబ్సిడీతో సరుకులు, రుణాలు అందే అవకాశం
- గతంలో రాజకీయ జోక్యంతో మూత
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చేనేతల ఎదురుచూపులు



ఎమ్మిగనూరులోని నూలు విక్రయ కేంద్రం

ఎమ్మిగనూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాల హయాంలో ఏర్పాటైన చేనేతల క్లస్టర్ మూలకు పడింది. అనంతరం 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అయితే కేంద్ర నిధులు రాకపోవడంతో నిలిచిపోయాయి. అయితే 2016 మేలో కేంద్ర ప్రభుత్వం చేనేతల క్లస్టర్ల ఏర్పాటును ప్రారంభిస్తున్నట్లు వివరాలు సేకరించి, చేనేతలు అధికంగా ఉన్న ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు ప్రాంతాల్లో ఆరు చేనేత క్లస్టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది.

ఇవీ క్లస్టర్లు

ఎమ్మిగనూరు పట్టణంలో రెండు, మండలంలో ఒకటి, ఆదోనిలో ఒకటి, కోడుమూరులో ఒకటి, కల్లూరులో ఒకటి ఏర్పాటు చేయాలని అధికారులు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే ఇంతవరకు అమలులోకి రాలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ నాయకులు చేనేతలను ఏమీ పట్టించుకోకపోవడంతో పథకం అటకెక్కింది. ప్రతిపాదనలు చేసినా నేటికి కార్యరూపం దాల్చలేదు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పాలకులు మాత్రం చేనేతలకు నేటికి ఆశలు కల్పిస్తున్నారే తప్ప వాటిని రాబట్టేందుకు చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.

క్లస్టర్ స్వరూపం

చేనేత క్లస్టర్‌లో 500 మంది సభ్యులు ఉంటారు. కేంద్ర ప్రభుత్వం రూ.2 కోట్లు నిధులు మంజూరు చేస్తుంది. నైపుణ్య శిక్షణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమిస్తుంది. శిక్షణలో చేనేతలకు ఉపకార వేతనం కూడా ఇస్తారు.

రాజకీయ జోక్యంతో మూత

2007లో ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన క్లస్టర్ రాజకీయ నాయకుల జోక్యంతో మూతపడిందని ఆరోపణలు ఉన్నాయి. క్లస్టర్‌లో దాదాపు 300 మంది సభ్యులు ఉండేవారు. వారికి అరకొర ముడి సరుకులు అందేవి. అలాగే బ్యాంకుల్లో కూడా పూర్తిస్థాయి రుణాలు అందేవి కావని ఆరోపణలు ఉన్నాయి. క్లస్టర్ మూత పడటంతో చేనేత కారికుల కష్టాలు అధికమయ్యాయి.

క్లస్టర్‌తో ప్రయోజనాలివీ..

క్లస్టర్లు ఏర్పాటైతే చేనేత కార్మికులకు వస్త్రాల తయారీ ముడిసరుకు సబ్సిడీతో అందుతుంది. నూలు, రంగులు, టోపురేష్మి, సొప్పరేష్మి, సర్లు, జాకాట్, డాబి, రీడ్లు, లైలాన్, లాడికొమ్ములు ఇందులో ఉంటాయి. చేనేత కార్మికులను గ్రూపులుగా ఏర్పాటు చేసి స్థానిక బ్యాంకుల్లో సబ్సిడీ రుణాలు కూడా ఇప్పిస్తారు. అలాగే వస్త్రాల తయారీలో నూతన డిజైన్లు చేసేందుకు శిక్షణ కూడా ఇస్తారు. ఇతర ప్రాంతాల్లో చేనేతల పని విధానం పరిశీలించేందుకు పంపుతారు. తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ కూడా కల్పిస్తారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

చేనేతలను ఆదుకుంటామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం క్లస్టర్లను పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో వెళ్లబుచ్చిందే తప్ప శాశ్వత పరిష్కారం చూపలేదు.కేంద్రం వద్ద ప్రతిపాదనలు ఉన్నా వాటిని తెచ్చే విషయంలో పూర్తిగా విఫలమైందని చేనేతులు ఆరోపిస్తున్నారు. ముడిసరుకును బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తూ చేనేతలు నష్టపోయారు.

టీడీపీ ప్రభుత్వం రాకతో చిగురించిన ఆశలు

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేతల్లో ఆశలు చిగురించాయి. ఎమ్మిగనూరులో చేనేత క్లస్టర్లు తిరిగి ఏర్పాటు అవుతాయని చేనేతలు ఆశతో ఎదురు చూస్తున్నారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలో టీడీపీ రావటంతో క్లస్టర్లు ఏర్పాటు సులువయ్యే అవకాశం ఉంది. ఇందుకు రాజకీయ నాయకులు ప్రయత్నించాలని చేనేతలు కోరుతున్నారు.

రుణాలు, సబ్సిడీ సరుకులు అందేవి



చేనేత క్లస్టర్‌లో సభ్యుడిగా ఉన్నాను. అప్పుడు ముడి సరుకులు నాకు సబ్సిడీ ధరతో అందేవి, అలాగే రెండు మూడు సార్లు బ్యాంకులో రుణం కూడా ఇచ్చారు. వాటిని తిరిగి చెల్లించాము. క్లస్టర్ మూత పడటంతో ఇబ్బంది పడుతున్నాం.

- రంగప్ప, చేనేత కార్మికుడు, ఎమ్మిగనూరు

ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి



కేంద్ర ప్రభుత్వం చేనేత క్లస్టర్ల ఏర్పాటును ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలి. క్లస్టర్లను అనుభవం ఉన్న చేనేత కార్మికులకు అప్పజెప్పాలి. అప్పుడే క్లస్టర్లు బాగా నడిచే అవకాశం ఉంటుంది. రాజకీయాల జోక్యం ఉండకుండా చూడాలి.

- శంకరన్న, చేనేత జన సమాఖ్య నాయకుడు, ఎమ్మిగనూరు

13ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు..

- ఆనందంలో కుటుంబ సభ్యులు
- ఆరేళ్ల వయసులో తప్పిపోయిన వినయ్



వినయ్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ, సర్పంచ్

మంత్రాలయం, మే 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రపురం చెందిన పెంచాలయ్య, రామాంజినమ్మ పెద్ద కుమారుడు వినయ్ ఆరేళ్ల వయసులో తప్పిపోయి 13 ఏళ్ల అనంతరం తల్లదండ్రుల చెంతకు చేరాడు. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఒక్కసారిగా ఆనందంలో మునిగితేలారు. వివరాలివీ.. రామాంజినమ్మ రాఘవేంద్రస్వామి మఠంలో స్వీపర్‌గా పని చేస్తోంది. వినయ్ అనే ఆరు సంవత్సరాల కుమారుడు వెంట వచ్చేవాడు. అయితే 2012 జనవరిలో బృందావన్ గార్డెన్స్ గెస్టుహౌస్ సమీపంలోని పరిసరాలను తల్లి శుభ్రం చేస్తున్న సమయంలో వినయ్ తప్పిపోయాడు. ఆ ప్రాంతంలోనే భక్తులు గుర్తించి ఏడుస్తున్న బాలుడుని హైదరాబాదుకు తీసుకెళ్లి ఉప్పల్ ఆగపే ఆర్ఫన్ క్రిస్టియన్ హాస్టల్‌లో చేర్పించారు. అదే హాస్టల్‌లో 7వ తరగతి వరకు చదివి హాస్టల్‌లో చెప్పకుండా సికింద్రాబాదు రైల్వేస్టేషన్‌లో రైలెక్కాడు. తీరా కర్నూలు జిల్లా డోన్‌లో దిగాడు. డోన్‌లోనే రమేష్ బైక్ మెకానిక్ వద్ద పని చేస్తూ జీవనం సాగిస్తూ ఓపెన్ టెన్త్ పరీక్షలు రాసి పాసయ్యాడు. ఎలాగైనా చదవాలన్న ఉద్దేశంతో ఆ విద్యార్థి తపనతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను కలిసి తన పేరు తెలియదని, తాను ఒక అనాథ అని, తన చరిత్రను తెలపడంతో మానవత్వంతో ఆదరించి ఇంటర్ సీఈసీలో 2024-25 మొదటి సంవత్సరంలో చేర్పించి స్థానిక ఎస్సీ హాస్టల్‌లో వసతి కల్పించారు. మార్చిలో వచ్చిన ఇంటర్ ఫలితాల్లో 435/500 మార్కులు సాధించి కళాశాలలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. అయితే డోన్ నుంచి ఎక్కడికైనా వెళ్లి ఉండాలని నిర్ణయించుకున్నాడు. అయితే వినయ్ గతంలో ఆగపే ఆర్ఫన్ హాస్టల్‌లో ఉన్నప్పుడు పరిచయమైన హైకోర్టు అడ్వకేట్ పత్తిపాటి సింగరావు, అనూరాధ దంపతులకు రెండు రోజుల క్రితం డోన్‌లో కనిపించాడు. ఆరా తీస్తే.. గతంలో హాస్టల్‌లో ఉన్నట్లు గుర్తు పట్టిన హైకోర్టు అడ్వకేట్ వివరాలు సేకరించారు. తన హాస్టల్ రికార్డులో మంత్రాలయం పేరుగా ఉందని గుర్తించి మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఎస్‌ఐ శివాంజల్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి మంత్రాలయం బస్సు ఎక్కించి పంపించారు. దీంతో ఆ యువకుడు మంత్రాలయానికి చేరుకున్నాడు. గతంలో బాలుడు అదృశ్యమైనట్లు తెలిసిన సర్పంచ్, బాలుడితో పాటు బాలుడి తల్లిదండ్రులను తీసుకొని పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎస్‌ఐ శివాంజల్.. 2012 జనవరి 28న ఐపీసీ 5/2012 సెక్షన్ కింద బాలుడి అదృశ్యం కేసు వివరాలను ఆరా తీశారు. చిన్న వయసులో తప్పిపోయిన బాలుడే ఈ యువకుడు అని నిర్ధారించారు. తల్లిదండ్రుల తమ కుమా రుడిని గుర్తు పట్టారు. అయితే ఆ బాలుడు మొదట తల్లిదండ్రులను గుర్తు పట్టలేదు. అయితే తన నాన్నమ్మను గుర్తుపట్టాడు. చివరగా యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైతులను ఆదుకోవాలి



ఆదోనిలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కౌతాళం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు మల్లయ్య, ఈరన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆదోనిలో విలేకరులతో మాట్లాడుతూ నదితీర గ్రామాలైన మేళిగనూరు, నదిచాగి, కుంబళనూరు, మరళి, వల్లూరు గ్రామాలతో పాటు ఎల్లెల్సీ కింద సాగు చేసిన కుంటనహల్, రాజానగర్ గ్రామాల రైతులు ఏప్రిల్, మే నెలల్లో కురిసిన వడగండ్ల వానలో వరి నేలవాలిందన్నారు. ప్రభుత్వం పరిహారం అందిచాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బషా, అయ్యప్ప, దావీదు ఉన్నారు.

ల్యాక్రోస్ క్రీడలో డి.బెళగల్ విద్యార్థి ప్రతిభ

కోసిగి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.బెళగల్ గ్రామానికి చెందిన క్రీడాకారుడు హుసేన్ రాష్ట్ర స్థాయి ల్యాక్రోస్ క్రీడలో ప్రతిభ కనబరిచి మెడల్ సాధించడం పట్ల గ్రామస్థులు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ జట్టు నుంచి ఏప్రిల్ 29 నుంచి మే 1 వరకు ఉత్తరప్రదేశ్‌లో థర్డ్ నేషనల్ ల్యాక్రోస్ చాంపియన్ షిప్‌లో హుసేన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి బ్రౌంజ్ మెడల్ సాధించారన్నరు. అసోసియేషన్ అధ్యక్షుడు మునికృష్ణ, జనరల్ సెక్రటరీ సురేంద్రరెడ్డి, కర్నూలు ల్యాక్రోస్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికృష్ణ, జనరల్ సెక్రటరీ రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివ, గ్రామ పెద్దలు రామయ్య, తిక్కన్న సోల్మాన్ రాజు అభినందనలు తెలిపారు.



అభినందిస్తున్న గ్రామస్థులు

కేసు నమోదు

మంత్రాలయం, మే 5 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని బూదూరు గ్రామానికి చెందిన ఈరమ్మ అనే వివాహిత తన మామ నరసన్న, అత్త హనుమంతమ్మ, బావ లక్ష్మినారాయణలపై కేసు నమోదు చేసినట్లు మంత్రాలయం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మినారాయణ తెలిపారు. గొల్ల ఈరమ్మ సి.బెళగల్ మండలం, పోలకల్ గ్రామం. 8 ఏళ్ల క్రితం మంత్రాలయం మండలం బూదూరు గ్రామానకి చెందిన గొల్ల నరసన్న కుమారుడు ఈరన్నకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. 2021లో హైదరాబాదులో ఓ ఇంటి నిర్మాణంలో కూలీ పనులు చేస్తుండగా.. విద్యుత్ షాక్‌కు గురై భర్త ఈరన్న మృతి చెందడంతో. నష్టపరిహారంగా రూ.3.75 లక్షలు ఇచ్చారు. అందులో భార్యకు రూ.1.50లక్షలు ఇచ్చి మిగతా రూ.2.25లక్షలు పిల్లల ఖాతాలో జమ చేస్తామని చెప్పి ఇంత వరకు జమ చేయలేదని, పోలీస్ స్టేషన్‌లో సోమవారం పిర్యాదు చేసింది. ఈమె పిర్యాదు మేరకు భర్తకు సంబందించి డబ్బులు ఇవ్వకుండా, ఆస్తి భాగంలో భూమి ఇవ్వకుండా వేదిస్తున్న మామ నరసన్న, అత్త హనుమంతమ్మ, బావ లక్ష్మినారాయణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి నారాయణ తెలిపారు

'ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండాలి'

గోనెగండ్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్‌కు యువత దూరంగా ఉండాలని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ సూచించారు. సోమవారం మండలంలో ఫ్యాక్షన్ గ్రామమైన కున్నూరు గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చక్కగా చదివించాలని కోరారు. పోలీసు చట్టాలు, కోర్టు న్యాయం పట్ల అవగాహన కల్పించారు. ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

కౌతాళం, మే 5(ఆంధ్రజ్యోతి): ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన విజయశేఖర రావును సోమవారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, నాయకుడు రమేష్ గౌడ్ సన్మానించారు. ప్రభుత్వ ప్రయోజనాలు అరుులైన వారికి చేరేలా చూడాలన్నారు. ఎంపీడీఓను కలిసిన వారిలో టీడీపీ మైనార్టీ నాయకుడు రెహమాన్, ఎస్సీ సెల్ నాయకుడు రాజబాబు, బీసీ నాయకుడు సిద్ధూ ఉన్నారు.

'వేస్టేజీ నీరు వదిలితే చర్యలు'



రొయ్యల చెరువును పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోసిగి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మిగనూరు గ్రామంలోని రొయ్యల చెరువు నుంచి రసాయనాలు కలిగిన మురుగునీరును తుంగభద్ర నదిలోకి రొయ్యల చెరువుల లీజుదారుడు శివనారాయణ గుట్టుచప్పుడు కాకుండా నదిలోకి వదలడంతో సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో తుంగభద్ర నదిలోకి కలుషిత నీరు అన్న కథనంతో సోమవారం తుమ్మిగనూరులోని రొయ్యల చెరువును ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఫిషినరీ డిపార్టుమెంటు అధికారి నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఈవోపీఆర్డీ, వీఆర్వోలు రొయ్యల చెరువును పరిశీలించి ఈ నీటిని తుంగభద్ర నదిలోకి వదిలితే వారిపైన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇది పునరావృతమైతే రొయ్యల చెరువుల నిర్వహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

ఆర్టీసీ ఎండీ మొండి వైఖరి విడనాడాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్/ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సోమవారం ఎమ్మిగనూరు డిపో రిజనల్ సహయ కార్యదర్శి ఎస్.పి.ఎం.సాహెబ్ అధ్యక్షతన డిపో అధ్యక్షులు రఫీక్, కార్యదర్శి ముస్తాక్ అహ్మద్‌ల అధ్వర్యంలో తమ డిమాండ్లను పరిష్కరించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ విషయంలో ఎండీ చోరవ తీసుకొని పరిష్కరించకపోతే రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన సమ్మెకు సిద్ధమని హెచ్చరించారు .అనంతరం ఎమ్మార్వో శేషాఫణికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎం.ఎల్.రెడ్డి, తిమ్మప్ప, నాగరాజు,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా రీ సర్వే చేయాలి

పెద్దకడుబూరు, మే 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో జరిగే రీ సర్వే పనుల్లో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, మండల కమిటీ నాయకులు దేవదాసు అన్నారు. ఈ విషయమై సోమవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గీతాప్రియదర్శినికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీ సర్వేల్లో జాయింట్ ఎల్‌పీఎం లు లేకుండ చేయాలన్నారు. ప్రతి రైతుకు నోటీసులు ఇచ్చి రీ సర్వే చేయాలన్నారు. సాగు చేసుకున్న ప్రతి రైతుకు ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలన్నారు. క్లైమ్‌కాని భూమి ఉంటే ఎంజాయ్‌మెంట్ ఉన్నవారికి ఆన్‌లైన్ చేయాలన్నారు. దేవాదాయభూమి, బంజరు, వంక పోరంబోకు భూములకు ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలన్నారు.

వైభవంగా వీరనాగప్ప పల్లకీ ఉత్సవం

మంత్రాలయం, మే 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ఉప్పలపాడు నుంచి ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన మాధవరానికి పల్లకిలో రాగా ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం దేవమ్మ ఆలయం నుంచి కలశాలు, మహా మంగళహారతులు, బీరప్పడోళ్లు, పిల్లనగ్రోవి, కొంజాటలతో వీరనాగప్ప పల్లకోత్సవం మాధవరం నాలుగు రోడ్ల కూడలి నుంచి చర్చి, సంత మార్కెట్, గ్రామ చావిడి మీదుగా దేవమ్మ గుడి వద్దకు చేర్చి ప్రత్యేక పూజలు, హారతులు ఇచ్చారు. టీడీపీ నాయకులు నారాయణ, ఎంపీటీసీ ఈరన్న, పెద్ద మల్లయ్య, గొరవయ్య, నాగిరెడ్డి, రమేష్, మంచాల ఈరన్న, గిరిమల్లయ్య, రామకృష్ణ, జయరాముడు, వీరేష్, బాగోడప్ప, నాగిరెడ్డి, ఈరన్న, మల్లయ్య, బొజ్జప్ప, నాగరాజు భక్తులు పాల్గొన్నారు.

41డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఎమ్మిగనూరు రూరల్, మే5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలో సోమవారం ఉష్ణోగ్రత 41డిగ్రీలు నమోదైనట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్రచౌదరి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం వరకు గరిష్ట ఉష్ణోగ్రత 37 నుంచి 38 వరకు, కనిష్ట ఉష్ణోగ్రత 27 నుంచి 28 వరకు ఉంటుందన్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందన్నారు. శనివారం రోజున వర్షంపడే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రతలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడ దెబ్బతగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సంచార చికిత్సా నోడల్ అధికారి డా రఘు సూచించారు. సోమవారం పట్టణంలోని శిల్పాకాలనీలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో అలసట, తలనొప్పి, నోరు ఎండిపోవటం, ఒళ్లు నొప్పులు, వాంతులు, జ్వరం, వంటి లక్షణాలు కన్పిస్తే సమీపంలోని ఆసుపత్రులకు తీసుకెళ్లాలనాన్నరు. సమావేశంలో డా. శ్రీనివాసబాబు, ఆరోగ్య విస్తరణాధికారి విజయకృష్ణ, ఖలీల్, పాల్గొన్నారు.

అన్నదాన షెడ్డు కోసం విరాళం



దాతలకు ప్రసాదం అందిస్తున్న ఆలయ సిబ్బంది

కౌతాళం, మే 5(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి అన్నదాన షెడ్ నిర్మాణం కోసం సోమవారం ఓ భక్తురాలు రూలక్ష నగదును ఆన్‌లైన్ ద్వార విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ విజయరాజు విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన కృష్ణవేణి అనే భక్తురాలు ఆన్‌లైన్ ద్వార రూ.1,00,001లను దేవస్థానపు కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. దాతల సంబధీకులకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఆలయ జూనియర్ అసిస్టెంట్ వీరేష్ ఉన్నారు.


స్వాగతం - సుస్వాగతం
కీ॥శే॥ శ్రీ బి.వి. మోహన్‌రెడ్డి గారు
మాజీ మంత్రివర్యులు, ఎమ్మిగనూరు.
కీ॥శే॥ పద్మశ్రీ
మాచాని సోమప్ప గారు
చేనేతపురి ఎమ్మిగనూరు నియోజకవర్గ చరిత్రలో
సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ అపూర్వ ఘట్టం
ఎమ్మిగనూరు మండలం, బనవాసి నందు నేడు 06-05-2025 మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా (వర్చువల్) మెగాటెక్స్‌టైల్స్ పార్కు భూమి పూజ కార్యక్రమానికి విచ్చేయుచున్న అతిరథ మహారథులకు, జిల్లా నాయకులకు, కార్యకర్తలకు స్వాగతం - సుస్వాగతం.
మాజీ మంత్రివర్యులు కీ॥శే॥ బి.వి.మోహన్‌రెడ్డి గారి చిరకాల స్వప్నమైన మెగా టెక్స్‌టైల్స్ పార్కును వారి తనయుడు యువ డైనమిక్ లీడర్ డా॥ బి.వి. జయనాగేశ్వరరెడ్డి గారి కృషితో తన తండ్రి గారి కల నిజం చేసిన గొప్ప సందర్భంగా ఇది తండ్రికి తగ్గ తనయుడుగా పేరు నిలబెట్టుకున్న ఎమ్మిగనూరు అభివృద్ధి ప్రధాత డా॥ బి.వి.జయనాగేశ్వరరెడ్డి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.
గౌ॥ శ్రీ నారా
చంద్రబాబు నాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్.
గౌ॥ శ్రీ డా॥ బి.వి.
జయనాగేశ్వరరెడ్డి గారు
PAC సభ్యులు & శాసనసభ్యులు,
ఎమ్మిగనూరు.
తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కర్నూలు జిల్లా.


స్వాగతం..
సుస్వాగతం..
శ్రీమతి యస్. సవిత
మంత్రి వర్యులు, బిసి సంక్షేమం,
హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్స్ శాఖ
శ్రీమతి టి.జి. భరత్
మంత్రి వర్యులు
పరిశ్రమల శాఖా మాత్యులు
చేనేత కార్మికుల చిరకాలస్వప్నమైన మెగా టెక్స్‌టైల్స్ పార్క్ గౌ॥ శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు మరియు స్వర్గీయ బి.వి. మోహన్ రెడ్డి గారి తనయుడు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే గౌ॥ డా॥ బి.వి. జయనాగేశ్వర రెడ్డి గారి కృషితో తన తండ్రి గారి స్వప్నం నిజం చేసిన సందర్భముగా మా హృదయ పూర్వక ధన్యవాదములు.
చేనేతపురి ఎమ్మిగనూరు నియోజకవర్గ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ దగ్గ అపూర్వ ఘట్టం
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి చేతుల మీదుగా (వర్చువల్)
మెగా టెక్స్‌టైల్ పార్క్ భూమి పూజ కార్యక్రమమునకు విచ్చేస్తున్న
పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి వర్యులు
గౌ॥ శ్రీ టి.జి. భరత్ గారు, మరియు
బి.సి. సంక్షేమం హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ శాఖ మాత్యులు
గౌ॥ శ్రీమతి యస్. సవిత గారు
శంఖుస్థాపనకు విచ్చేస్తున్న అగ్రనేతలు, మంత్రులు, నాయకులు,
మహిళా మణులు, టిడిపి కార్యకర్తలు, నందమూరి అభిమానులు
అందరికి స్వాగతం- సుస్వాగతం..
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
ఆంధ్రప్రదేశ్
రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు
డా॥ శ్రీ బి.వి. జయనాగేశ్వర రెడ్డి గారు
ఎమ్మిగనూరు శాసనసభ్యులు, కర్నూలు జిల్లా
రాష్ట్ర శాసనసభ పిఎసి కమిటీ సభ్యులు
బుగిడె నాగరాజు నేత
టిడిపి చేనేత నాయకులు, ఎమ్మిగనూరు.